గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
Gtv GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.



# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక








హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 214, ఎడిటర్,భీముడు నాయక్ పేజీలు : 12, వెల రూ. 1, గురువారం - 12 - సెప్టెంబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2

## ప్రపంచంలోని ప్రతి డివైస్ లో భారత్‌లో తయారు చేసిన చిప్ ఉండాలనేది కల

- దేశంలోనే 100 శాతం ఎలక్ట్రానిక్ తయారీ జరగాలన్న ప్రధాని మోదీ
- భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని పిలుపు
- నోయిడాలో 'సెమికాన్ ఇండియా 2024' ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ వ్యాఖ్యలు

## ఆక్రమించుకోవడానికి కర్ణాటక సీఎం సీటు ఖాళీగా లేదు


2

ముడా కుంభకోణం కేసులో హైకోర్టులో విచారణ

సిద్దూ సీఎం పదవి నుంచి తప్పుకుంటే తదుపరి సీఎం ఎవరు? అనే చర్చ

సీఎం పదవి ఖాళీగా లేనప్పుడు కొత్తగా మరొకరు సీఎం ఎలా అవుతారన్న సిద్ధరామయ్య

**న్యూఢిల్లీ,:** ముఖ్యమంత్రి సీటు ఎవరో ఆక్రమించుకోవడానికి కర్ణాటక సీఎం సీటు ఏమీ ఖాళీగా లేదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ముడా (మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కుంభకోణం కలకలం సృష్టిస్తోంది. హైకోర్టులో ఈ అంశంపై విచారణ జరుగుతోంది.

## పసికందును కుక్కలు పీక్కుతిన్న ఘటన కలిచివేసింది

వివరాలు 2లో..



-కుక్కల దాడుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న మాజీ మంత్రి

-కుక్కలు పీక్కుతింటున్న ఘటనపై ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని విమర్శ

-కుక్కలు పీక్కుతినడం, కుక్కకాటు మరణాలు సర్వసాధారణమయ్యాయని ఆగ్రహం

హైదరాబాద్, : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో మగశిశువును కుక్కలు పీక్కుతున్న ఘటన తనను ఎంతో కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

# మీకు మీరుగా తప్పుకుంటేనే గౌరవం..
# బడాబాబులకు సీఎం రేవంత్ హెచ్చరిక

- అక్రమ నిర్మాణాలను కూల్చేయడం తప్పదన్న సీఎం
- కోర్టుల్లోనూ పట్టువిడవకుండా పోరాడతామని వెల్లడి
- తెలంగాణ పోలీస్ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్ లో సంచలన వ్యాఖ్యలు
- ముఖ్యమంత్రి సహాయనిధికి తెలంగాణ పోలీసుల భారీ విరాళం
- భారీ వర్షాల కారణంగా తెలంగాణ అతలాకుతలం
- వరద బాధితుల సహాయార్థం ప్రముఖుల విరాళాలు
- ఒకరోజు జీతాన్ని సీఎం సహాయనిధికి విరాళంగా ఇచ్చిన తెలంగాణ పోలీసులు



వివరాలు 2లో..

**హైదరాబాద్, :** అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, కూల్చివేత తప్పదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టుల వద్ద ఫాంహౌస్ లు కట్టుకుంటూ డ్రైనేజీని గండిపేటలో కలుపుతున్నారని ఆరోపించారు. అలాంటి వాళ్లు అక్రమ నిర్మాణాల నుంచి తమకు తాముగా తప్పుకుంటే గౌరవంగా ఉంటుందని చెప్పారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ కట్టిన నిర్మాణాలను కూల్చివేయడంతప్పదన్నారు. వాటిపై కోర్టుకు వెళ్లినా విడిచిపెట్టేసమస్యేలేదని,న్యాయస్థానాల్లోనూ పోరాడతామని స్పష్టంచేశారు. బుధవారం తెలంగాణ పోలీసు అకాడమీలో నిర్వహించిన పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలాలను ఆక్రమించుకోవడంతో వరదలు వచ్చి పేదల ఇళ్లు నీటమునుగుతున్నాయని అన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమించి కట్టిన వాటిని తొలగించేందుకే హైడ్రాను ఏర్పాటు చేశామని వివరించారు. చెరువులను పూర్వ స్థితిలోకి తీసుకెళ్లేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. ఆక్రమణలు తొలగించి మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తామన్నారు.

## 'హైడ్రా'కు మరో కీలక బాధ్యత!

- నగరంలో నిత్యం ఎక్కడో ఒకచోట ఆక్రమణల కూల్చివేతలతో దూసుకెళుతున్న హైడ్రా
- ప్రభుత్వం మంజూరు చేసే బిల్డింగ్ పర్మిషన్ల ప్రక్రియలోనూ హైడ్రాను చేర్చే యోచన



2

## హెచ్చరిక..! ఏపీకి పొంచి ఉన్న ముప్పు

ఇప్పటికే ఆరెంజ్ అలెర్ట్ జారీ

గంటకు 30 కిలోమీటర్ల వేగంతో గాలులు

వివరాలు 2లో..



## కర్ణాటక వాల్మీకి స్కామ్ డబ్బులే తెలంగాణ కాంగ్రెస్ వాడింది


2

### మరో స్కాంకు తెరలేపిన కాంగ్రెస్

**హైదరాబాద్, :** కర్ణాటకలో సంచలనంగా మరిన వాల్మీకీ స్కామ్ డబ్బులనే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వాడిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ విషయంలో తాము చెప్పిందే నిజమైందన్నారు. ఈ మేరకు వాల్మీకి స్కామ్ పై ఎక్స్(ట్విట్టర్) వేదికగా ఆయన స్పందించారు. కర్ణాటకలోని గిరిజనుల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన సొమ్మును ఎన్నికల ప్రచారం కోసం వాడుకున్న కాంగ్రెస్ నేతలను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంలో కాంగ్రెస్ నేత, కర్ణాటక మాజీ మంత్రి బి.నాగేంద్ర కీలక సూత్రధారి అని ఈడీ ఛార్జ్ ?షీట్?లో నిర్ధారించిందని కేటీఆర్ తెలిపారు. రూ. 187 కోట్ల రూపాయలు ఏకంగా కాంగ్రెస్ మంత్రి చేతుల మీదుగా దారి మళ్లించి, ఆ సొమ్మును తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మే 14న జరిగిన లోక్‌సభ ఎన్నికల కోసం ఉపయోగించిందని కేటీఆర్ ఆరోపించారు.

## మూడు నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన అప్పుల లెక్కలిలా..!!


2

నాలుగు నెలల్లో రూ 43 వేల కోట్లు

కూటమి ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ పైన చర్చ

పెరుగుతున్న అప్పులు

వరదలతో రెవిన్యూ వసూళ్ల పైన ప్రభావం

**అమరావతి,:** ఏపీలో కూటమి పాలనలో ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది. ఎన్నికల సమయంలో వైసీపీ హాయంలో చేసిన అప్పులను కూటమి నేతలు ప్రధానంగా ప్రచారం చేసారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాన రంగాల పైన శ్వేత పత్రాలను విడుదల చేసారు. ఆర్థికంగా రాష్ట్రం కష్టాల్లో ఉందని ప్రతీ సందర్భంలోనూ చెబుతున్నారు. దీంతో..

## రేవంత్ రెడ్డికి చేతకావడం లేదు... బీజేపీ గెలిస్తే కేసీఆర్‌కు చుక్కలు చూపించేవాళ్ళం

వివరాలు 2లో..



- రేవంత్ రెడ్డి తోపు అనుకున్నాను.. కానీ కేసీఆర్‌ను జైల్లో పెట్టడం సాధ్యం కావడం లేదని వ్యాఖ్య
- బీజేపీ గెలిస్తే అంకుశం సినిమాలో వలె కేసీఆర్‌కు చుక్కలు చూపించేవాళ్లమన్న సంజయ్

# జైల్లో ఉన్న నందిగం సురేశ్ ను పరామర్శించిన జగన్...

**చంద్రబాబుపై ఫైర్**

- నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి
- ఇటీవల వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ అరెస్ట్
- గుంటూరు జైలు వద్దకు వచ్చిన జగన్
- ఇంత దుర్మార్గపు పాలన ఎక్కడా చూడలేదంటూ ఆగ్రహం



వివరాలు 2లో..

**అమరావతి,:** టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అరెస్ట్ అయి, గుంటూరు జైల్లో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేశ్ ను వైసీపీ అధ్యక్షుడు జగన్ పరామర్శించారు. ఈ మధ్యాహ్నం గుంటూరు వచ్చిన జగన్ నందిగం సురేశ్ తో 'ములాఖత్' ద్వారా మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని నందిగం సురేశ్ కు సూచించారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం జైలు వెలుపల జగన్ మీడియా సమావేశం నిర్వహించారు. చంద్రబాబు తప్పుల నుంచి దృష్టి మరల్చేందుకే నాలుగేళ్ల నాటి కేసును తిరగదోడారని ఆరోపించారు. అక్రమ కేసు బనాయించి ఒక దళిత నేతను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత దుర్మార్గపు పాలన ఎక్కడా లేదని అన్నారు. నాడు దాడి ఘటనలో నందిగం సురేశ్ పాల్గొని ఉంటే సీసీటీవీ ఫుటేజిలో కనిపించాలి కదా... అని వ్యాఖ్యానించారు. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నన్ను కూడా దూషించారు...

# గత పాలకుల పాపాలు.. మనకు శాపాలు

- బుడమేరులో పూడిక తీయలేదు.. గుంతలు పూడ్చలేదని ఆరోపణ
- అందువల్లే విజయవాడకు కనీవినీ ఎరగని వరదలు వచ్చాయని వివరణ
- ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టిన బోట్లు వైసీపీ వాళ్లవేనని వెల్లడి


వివరాలు 2లో..

**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్ లో గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలు మనకు ఇప్పుడు శాపాలుగా మారాయని సీఎం చంద్రబాబు ఆరోపించారు. బుడమేరు పట్ల నాటి సర్కారు వహించిన నిర్లక్ష్య ధోరణి విజయవాడకు ముప్పుగా పరిణమించిందని చెప్పారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా బుడమేరు పూడిక తీయలేదని, గండ్లు పూడ్చలేదని విమర్శించారు. దీంతో భారీ వర్షాలకు విజయవాడను కనీవినీ ఎరగని వరద ముంచెత్తిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. బుడమేరు వాగు పరిధిలో గత ప్రభుత్వం అక్రమార్కులను ప్రోత్సహించిందని, అక్రమ కట్టడాలకు తప్పుడు దారిలో అనుమతులిచ్చిందని వివరించారు. కుండపోత వర్షాలు, వరదలకు వాతావరణ మార్పులు కారణమని చెప్పారు. అయితే, ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వరదల ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు.

**ఆ బోట్లు వాళ్లవే..**

ఎన్నికల్లో ఓడించిన ప్రజలపై కక్ష తీర్చుకునే వైపుగా వైసీపీ నాయకులు పోతున్నారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు.

గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
గురువారం - 12 - సెప్టెంబర్ - 2024

# ప్రపంచంలోని ప్రతి డివైస్ లో భారత్‌లో తయారు చేసిన చిప్ ఉండాలనేది కల

మొదటి పేజి తరువాయి

న్యూఢిల్లీ,: ప్రపంచంలోని ప్రతి ఎలక్ట్రానిక్ డివైస్ లో భారత్‌లో తయారు చేసిన చిప్ ఉండాలనేది తమ ఆకాంక్ష అని, దేశంలోనే 100 శాతం ఎలక్ట్రానిక్ తయారీ జరగాలన్నదే తమ కల అని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్‌లో 'సెమికాన్ ఇండియా 2024'ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెమీకండక్టర్ల రంగానికి చెందిన ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ... భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని వారిని కోరారు. భారత్‌ను సెమీ కండక్టర్ హౌస్‌గా మార్చేందుకు చేయాల్సిందంతా చేస్తామన్నారు. దేశంలో ప్రస్తుతం త్రీ డైమెన్షనల్ పవర్ ఉందన్నారు. అనుకూలమైన ప్రభుత్వం, తయారీ రంగానికి అనుకూలమైన వాతావరణం, ఆశావహ మార్కెట్... ఈ మూడు భారత్‌లో ఉన్నాయన్నారు. టెక్నాలజీ రుచి ఏమిటో తెలిసిన ఇలాంటి మార్కెట్ మరోచోట దొరకదన్నారు. భారత్‌లో మార్కెట్ అనుకూల వాతావరణం ఉందన్నారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు ఎదురైనా తట్టుకొని నిలబడగలిగే సరఫరా గొలుసు అన్నింటికీ ముఖ్యమన్నారు. అలాంటి సరఫరా గొలుసును సృష్టించేందుకు భారత్ కృషి చేస్తోందన్నారు. కరోనా సమయంలో ఈ విషయంలో భారత్‌కు ఎదురు దెబ్బలు తగిలాయని గుర్తు చేసారు. ఇప్పుడు భారత్‌లో కనుక పెట్టుబడులు పెడితే 21వ శతాబ్దంలో చిప్స్ కొరత రానే రాదన్నారు. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టి... విలువను సృష్టించుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం ఉంటుందన్నారు. చిప్ అంటే కేవలం సాంకేతికకు మాత్రమే పరిమితం కాదని, కోట్లాదిమంది పౌరుల ఆకాంక్షలను నెరవేర్చే మాధ్యమం అన్నారు.

## ఆక్రమించుకోవడానికి కర్ణాటక సీఎం సీటు ఖాళీగా లేదు

మొదటి పేజి తరువాయి

ముడా (మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) కుంభకోణం కలకలం సృష్టిస్తోంది. హైకోర్టులో ఈ అంశంపై విచారణ జరుగుతోంది. ముడా కుంభకోణంపై విచారణ నేపథ్యంలో ఆయన సీఎం పదవి నుంచి వైదొలిగితే తదుపరి సీఎం ఎవరు అనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఆయన స్పందించారు. కర్ణాటకలో సీఎం పదవి ఖాళీగా లేదని, దీనిపై ఇంత వరకు ఎవరూ ప్రకటన కూడా చేయలేదన్నారు. సీఎం పదవి ఖాళీగా లేనప్పుడు ఇంకా కొత్తగా ఎవరు ముఖ్యమంత్రి అవుతారు? అని ప్రశ్నించారు. తానే సీఎంగా కొనసాగుతానని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు జరగాల్సి వస్తే సీఎం పదవికి పోటీ పడుతున్న మంత్రులు, సీనియర్లను హెచ్చరించాలని రాహుల్ గాంధీకి పార్టీ నేతల బృందం లేఖ రాసింది. ఈ క్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య పైవిధంగా సమాధానం చెప్పారు. ముఖ్యమంత్రి పదవిపై వస్తున్న ఊహాగానాలకు చెక్ పెట్టాలని కర్ణాటక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్ భండారి, ఎమ్మెల్సీ దినేశ్ గౌలిగూడ... పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను కోరారు.

## 'హైడ్రా'కు మరో కీలక బాధ్యత!

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్, : ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించడం, చెరువులను రక్షించడం కోసం సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం హైడ్రా నగరంలో నిత్యం ఎక్కడో ఒకచోట ఆక్రమణల కూల్చివేతలు చేపడుతూ వార్తల్లో నిలుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం మంజూరు చేసే బిల్డింగ్ పర్మిషన్ల ప్రక్రియలోనూ హైడ్రాను చేర్చాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నగరంలో ఇళ్ల నిర్మాణాలకు ఇక నుంచి హైడ్రా వద్ద కూడా ఎన్ఓసీ పొందాలనే కొత్త నిబంధనను అనుమతుల ప్రక్రియలో చేర్చే యోచనలో సర్కార్ ఉందట. కాగా, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో హైడ్రా అనుమతి లేకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే ఆ ఇంటి నెంబర్, కరెంట్, నల్లా కనెక్షన్లను తొలగించనున్నట్లు సమాచారం. పేద, మధ్య తరగతి ప్రజలు నష్టపోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వచ్చే అవకాశం ఉంది.

## హెచ్చరిక..! ఏపీకి పొంచి ఉన్న ముప్పు

మొదటి పేజి తరువాయి

**అమరావతి,:** వర్షాలు, వరదల నుంచి ఏపీ, తెలంగాణ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. వరదలవల్ల భారీగా నష్టపోయిన రెండు రాష్ట్రాలను ఆదుకునేందుకు అనేకమంది ముఖ్యమంత్రుల సహాయ నిధులకు విరాళాలను అందజేస్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బస్సునే ఇంటిగా చేసుకొని, కలెక్టరేట్‌నే సచివాలయంగా మార్చుకొని అధికారులచేత పనిచేయించారు. తాను కూడా దగ్గరుండి సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించి దాదాపు పది రోజుల తర్వాత ఇంటికి చేరుకున్నారు.

ఇప్పటికే ఆరెంజ్ అలెర్ట్ జారీ

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కూడా తీరం దాటింది. ఏపీ, ఒడిసాలపై దీని ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలను హెచ్చరించింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు ఇప్పటికే ప్రభుత్వం ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. అతి భారీ వర్షాలకు అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

గంటకు 30 కిలోమీటర్ల వేగంతో గాలులు

కోస్తాలో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మోస్తరు వానలు పడే అవకాశం ఉంది. ఇక్కడ ఇప్పటికే ఎల్లో అలర్ట్ జారీచేశారు. నైరుతి నుంచి గంటకు 30 కిలోమీటర్ల వేగంగో గాలులు వీస్తున్నాయి. సాయంత్రం సమయంలో కూడా గంటకు 30 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అంచనా ప్రకారం తక్కువ సమయంలో అధిక వర్షపాతం నమోదవడానికి అవకాశం ఉంది. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో అధికారులను అప్రమత్తం చేశారు.

## పసికందును కుక్కలు పీక్కుతిన్న ఘటన కలిచివేసింది

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్, : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో మగశిశువును కుక్కలు పీక్కుతున్న ఘటన తనను ఎంతో కలిచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడుల నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. బోధన్‌లో మగశిశువును కుక్కలు పీక్కుతున్నాయనే వార్త చదివి తాను ఎంతో ఆందోళనకు గురయ్యానన్నారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదన్నారు. కుక్కకాటుకు రాష్ట్రంలో చిన్నారులు బలవుతున్నారన్నారు. పిల్లలను కుక్కలు పీక్కు తినడం, కుక్కకాటు మరణాలు సర్వసాధారణంగా మారిపోయాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ ఏడాది రాష్ట్రంలో 60 వేలకు పైగా కుక్క కాట్లు నమోదయ్యాయని లెక్కలు చెప్పారు. పదుల సంఖ్యలో ప్రాణాలు కూడా కోల్పోయారన్నారు. కనీసం యాంటీరేబిస్ ఇంజెక్షన్లను కూడా ప్రభుత్వం ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచలేకపోతోందని విమర్శించారు. గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పడకేసిందని, చెత్తా చెదారం పేరుకుపోవడం వల్ల వీధి కుక్కల బెడద విపరీతంగా పెరిగిందన్నారు. మున్సిపాలిటీలో పురపాలక శాఖ వైఫల్యం వల్ల వీధి కుక్కల నియంత్రణ లేక మనుషుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 20 లక్షలకు పైగా వీధి కుక్కలు ఉంటే అందులో 10 లక్షలకు పైగా కుక్కలు జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉంటాయన్నారు. రాష్ట్రంలో కుక్కల బెడద విపరీతంగా ఉందన్నారు. వాటి స్టెరిలైజేషన్ కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని మండిపడ్డారు. కుక్కకాటుతో మరణించిన వారికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కర్ణాటక వాల్మీకి స్కామ్ డబ్బులే తెలంగాణ కాంగ్రెస్ వాడింది

మొదటి పేజి తరువాయి



రూ. 187 కోట్ల రూపాయలు ఏకంగా కాంగ్రెస్ మంత్రి చేతుల మీదుగా దారి మళ్లించి, ఆ సొమ్మును తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మే 14న జరిగిన లోక్‌సభ ఎన్నికల కోసం ఉపయోగించిందని కేటీఆర్ ఆరోపించారు. వాల్మీకి స్కామ్‌లో ప్రధాన నిందితుడు సత్యనారాయణ వర్మ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బిల్డర్ అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన ఇద్దరు కీలక కాంగ్రెస్ నేతలతో సత్యనారాయణ వర్మకు అత్యంత సన్నిహిత సంబంధాలున్నాయని తెలిపారు. వ్యాపారాల్లోనూ సత్యనారాయణ వర్మ ఇక్కడి కాంగ్రెస్ నేతలు భాగస్వాములుగా ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఇంకా చాలామంది కాంగ్రెస్ పెద్దలు ఉన్నారనేది నిర్వివాదమని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థలు వాల్మీకీ స్కామ్ గురించి నిజాలు నిగ్గుతేల్చాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మరో స్కాంకు తెరలేపిన కాంగ్రెస్

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మరో స్కామ్‌కు తెరలేపినట్లు తెలుస్తోందన్నారు కేటీఆర్. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ముచ్చర్ల ప్రాంతంలోని రెండు వేల ఎకరాల అభివృద్ధి పనులను దుబాయిలోని ఎమ్మార్ బిల్డర్స్‌కు అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ ఒప్పందం కోసం 11 ఏళ్లుగా కొనసాగుతున్న బౌల్డర్ హిల్స్ ప్రాజెక్టు కేసు నుంచి తప్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఎమ్మార్ బిల్డర్స్ కండిషన్ పెట్టినట్లు తెలుస్తోందన్నారు. బౌల్డర్ హిల్స్ ప్రాజెక్టు స్కామ్ కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మార్ ఎంజీఎఫ్ మధ్య జరిగిన వివాదాస్పద ఒప్పందమే కావడం గమనార్హం. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మార్ బిల్డర్స్ మధ్య తాజాగా ఒప్పందం జరిగినట్లు వస్తున్న కథనాలపై కేటీఆర్ స్పందించారు. ఈ ఒప్పందాన్ని చూస్తుంటే కాంగ్రెస్ పాలనలో మరో కుంభకోణం జరుగుతుందని అనిపిస్తోందన్నారు. స్కాంగ్రెస్ చేస్తున్న పనులను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

# మూడు నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన అప్పుల లెక్కలిలా..!!

మొదటి పేజి తరువాయి

ఆర్థికంగా రాష్ట్రం కష్టాల్లో ఉందని ప్రతీ సందర్భంలోనూ చెబుతున్నారు. దీంతో..కూటమి ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ పైన చర్చ మొదలైంది. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన నాలుగు నెలల కాలంలో చేసిన అప్పు రూ 43 వేల కోట్లకు చేరింది.

నాలుగు నెలల్లో రూ 43 వేల కోట్లు

జూన్ 12న కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నాలుగు నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం 43 వేల కోట్ల రూపాయలకు పైగా అప్పు చేసింది. ద్రవ్య, ఆదాయ లోటు కూడా భారీగానే రికార్డయింది. ఈ మేరకు ప్రధాన గణాంకాధికారి కార్యాలయం తాజాగా నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం అప్పులు కాకుండా, పన్నులు, ఇతర ఆదాయ మార్గాల ద్వారా ఏప్రిల్ నుంచి జులై వరకు రూ.44,822 కోట్లు ఖజానాకు చేరింది. ఇందులో జీఎస్టీ, భూములపై ఆదాయం,పన్నులు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా, కేంద్రం ఇచ్చిన గ్రాంట్లు వంటివి కలిపి రూ.41 వేల కోట్ల వరకు ఉంది.



పెరుగుతున్న అప్పులు

రాష్ట్ర అవసరాలకు ఆ మొత్తం చాలకపోవడంతో రుణాల ద్వారా రూ.43,058 కోట్లు సమకుర్చుకున్నారు. నెలకు దాదాపు 11 వేల కోట్ల రూపాయల మేర అప్పులు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. అయితే, రూ.87,282 కోట్లు మేర ఖర్చులయ్యాయి. ఆదాయానికి, వ్యయానికి మధ్య అంతరాన్ని రుణాలతోనే భర్తీ చేయాల్సి వచ్చిందని నివేదికలో పేర్కొన్నారు. ఈ అంతరం కారణంగానే లోటు కూడా గణనీయంగా నమోదైనట్లు తేలింది. ఆదాయ లోటు ఏకంగా 137.59 శాతంతో రూ.40,234 కోట్లుగా రికార్డుకాగా, ద్రవ్యలోటు కూడా 83.92 శాతంతో రూ.42,580 కోట్లకు చేరుకున్నట్లు తేలింది.

రెవిన్యూ వ్యయం

మొత్తం ఖర్చు రూ.87,282 కోట్లలో రెవెన్యూ వ్యయమే ఏకంగా రూ.85,056 కోట్ల వరకు ఉండడం గమనార్హం. అలాగే మొత్తం వ్యయంలో సేవా రంగానికే రూ.49 వేలకోట్ల వరకు ఖర్చు చేయడంతో మిగిలిన కొద్దిపాటి రూ.2,226 కోట్లను మాత్రమే పెట్టుబడి వ్యయానికి వెచ్చించాల్సి వచ్చిందని నివేదికలో పేర్కొన్నారు. ఇక ప్రభుత్వం పైన తాజా వరదలతో రెవిన్యూ వసూళ్ల పైన ప్రభావం పడింది. పథకాల నిర్వహణ పైన ఒత్తిడి పెరుగుతోంది. దీంతో, ప్రభుత్వం ఓట్ ఆన్ ఎకౌంట్ ను మాత్రమే ప్రవేశ పెట్టింది. వచ్చే నెలలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు కసరత్తు జరుగుతోంది.

## జైల్లో ఉన్న నందిగం సురేశ్ ను పరామర్శించిన జగన్...

మొదటి పేజి తరువాయి

నాడు దాడి ఘటనలో నందిగం సురేశ్ పాల్గొని ఉంటే సీసీటీవీ ఫుటేజిలో కనిపించాలి కదా... అని వ్యాఖ్యానించారు. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నన్ను కూడా దూషించారు... అయినా గానీ చంద్రబాబులా కక్షసాధింపు చర్యలకు దిగలేదు అని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు తప్పుడు సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని, రేపు టీడీపీ నాయకులకు కూడా ఇదే గతి పడుతుందని, వారు కూడా ఇదే జైల్లో ఉండాల్సి వస్తుందని ఘాటు హెచ్చరికలు చేశారు. రెడ్ బుక్ అంటున్నారని, అదేమీ ఘనకార్యం కాదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు పాలనను నిర్లక్ష్యం చేసి రెడ్ బుక్ పైనే శ్రద్ధ చూపిస్తున్నాడని ధ్వజమెత్తారు.

టీడీపీ గెలవగానే ఆ బోట్లపై విజయోత్సవాలు చేసుకోలేదా...?

వాతావరణ హెచ్చరికలను చంద్రబాబు పట్టించుకోలేదని జగన్ విమర్శించారు. బాబు తన ఇంటిని కాపాడుకునేందుకు విజయవాడను బలి చేశారని, బుడమేరు గేట్లు ఎత్తి విజయవాడ వరదలకు కారణమయ్యారని ఆరోపించారు. తద్వారా 60 మంది ప్రాణాలు కోల్పోయారని, మరి చంద్రబాబుపై ఎందుకు కేసు పెట్టరు? అని జగన్ ప్రశ్నించారు. ఆఖరికి చంద్రబాబు బోట్లతోనూ రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ బోట్లకు ఎవరి హయాంలో అనుమతి వచ్చిందో తెలుసుకోవాలని అన్నారు. ఎన్నికల్లో చంద్రబాబు విజయం సాధించగానే, ఇవే బోట్లపై విజయోత్సవాలు చేసుకున్నారని... అన్నింటికీ మించి బాబు, లోకేశ్ తో కలిసి బోట్ల యజమాని ఉషాద్రి ఫొటోలు కూడా దిగాడని జగన్ వెల్లడించారు. టీడీపీ వాళ్లకు చెందిన బోట్లను వైసీపీ నేతలవంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## గత పాలకుల పాపాలు.. మనకు శాపాలు

మొదటి పేజి తరువాయి

ఎన్నికల్లో ఓడించిన ప్రజలపై కక్ష తీర్చుకునే వైపుగా వైసీపీ నాయకులు పోతున్నారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. కృష్ణా నదిలో వదిలిపెట్టిన నాలుగు బోట్లు వైసీపీ వాళ్లవేనని చెప్పారు. ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేయడానికి ఆ పార్టీ వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాటిని నదిలో వదిలిపెట్టారని వివరించారు. ఆ బోట్లపై వైసీపీ రంగు ఉందన్న విషయం గుర్తుచేశారు. ఒకదానిని మరొకటి చైన్లతో కట్టి నదిలో వదిలి పెట్టడంతో అవి బ్యారేజీ గోడలను ఢీ కొట్టాయని, ఇప్పటికీ వాటిని బయటకు తీయడానికి అధికారులు శ్రమిస్తూనే ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ఆ బోట్లను ఇసుక అక్రమ రవాణాకు ఉపయోగించే వారని ఆరోపించారు. వైసీపీ లీడర్ జగన్ ఇప్పుడు మాట్లాడుతూ.. ఆ బోట్లు టీడీపీ వాళ్లవేనని తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని చంద్రబాబు మండిపడ్డారు. ప్రకాశం బ్యారేజీని కూల్చాలని కుట్ర చేశారని, దీని వెనక రాజకీయ లింకులు లేకుంటే ఒక్క నిమిషంలో నిందితులను ఏం చేయాలో అది చేసే వాడినని వివరించారు. రౌడీలు, గూండాలను తాను ఎన్నడూ సహించలేదని, సామాన్యులకు ఇబ్బంది కలిగించే వారిపట్ల తానెప్పుడూ కఠిన వైఖరినే అవలంబించానని చంద్రబాబు గుర్తుచేశారు.

## రేవంత్ రెడ్డికి చేతకావడం లేదు... బీజేపీ గెలిస్తే కేసీఆర్‌కు చుక్కలు చూపించేవాళ్ళం

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్, : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తోపు అని అనుకున్నానని... కానీ కేసీఆర్‌ను జైల్లో పెట్టడం ఆయనకు సాధ్యం కావడం లేదని కేంద్ర సహాయమంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శేరిలింగంపల్లిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే కేసీఆర్ సంగతి చూసేవాళ్లమన్నారు. అంకుశం సినిమాలో వలె కేసీఆర్‌కు చుక్కలు చూపించేవారమన్నారు. కానీ రేవంత్ రెడ్డికి చేతకావడం లేదన్నారు. ఢిల్లీకి వెళ్లి ఎవరిని పట్టుకోవాలో వారిని పట్టుకుంటే క్లోజ్ అవుతుందన్నారు. ఇలాంటి విషయాల్లో కేసీఆర్ మాత్రం ఆరితేరిన వ్యక్తి అన్నారు. ఎక్కడ ఎవరి జుత్తు పట్టుకోవాలో... ఎక్కడ ఎవరి కాళ్లు పట్టుకోవాలో కేసీఆర్‌కు బాగా తెలుసునని వ్యాఖ్యానించారు. తెలంగాణకు పట్టిన దశమగ్రహం కేసీఆర్ అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తమపై నాన్ బెయిలబుల్, రౌడీషీట్ కేసులు పెట్టిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. ఓ వైపు వరదలకు తెలంగాణలోని ప్రజలు అల్లాడిపోతుంటే కేసీఆర్ మాత్రం రీఎంట్రీ కోసం యాగాలు చేయడం ఏమిటన్నారు. కేసీఆర్‌కు ప్రజలు నో ఎంట్రీ బోర్డ్ పెట్టేశారని ఎద్దేవా చేశారు. అసలు కేసీఆర్ బయటకే రావడం లేదన్నారు. హైడ్రాతో మంచి జరుగుతోందా... చెడు జరుగుతోందా? కానీ ఈ అంశంపై ఆయన బయటకు రాలేదని విమర్శించారు. ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలను కూల్చుతున్నారు సరే... మరి అనుమతులు ఇచ్చిన వారి సంగతి ఏమిటని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మీకు మీరుగా తప్పుకుంటేనే గౌరవం.. బడాబాబులకు సీఎం రేవంత్ హెచ్చరిక

చెరువులను పూర్వ స్థితిలోకి తీసుకెళ్లేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. ఆక్రమణలు తొలగించి మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేస్తామన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలోని 11 వేల మంది నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చాం..

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పై నిరుద్యోగులకు ప్రస్తుతం ఎలాంటి అనుమానాలు లేవని రేవంత్ రెడ్డి చెప్పారు. కమిషన్ పారదర్శకంగా పనిచేస్తోందని, వరుసగా నోటిఫికేషన్లు జారీ చేసి నియామకాలను వివాదరహితంగా పూర్తిచేస్తోందని వివరించారు. ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని, మరో 35 వేల ఉద్యోగాల నియామక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి తెలంగాణ పోలీసుల భారీ విరాళం

**హైదరాబాద్, :** తెలంగాణలో భారీ వర్షాల కారణంగా పోటెత్తిన వరదలతో అతలాకుతలమైన ముంపు ప్రాంతాల బాధితులను ఆదుకునేందుకు పలువురు ప్రముఖులు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం పిలుపు మేరకు సినీ, రాజకీయ, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీ మొత్తంలో విరాళాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పోలీసులు కూడా తమ ఒకరోజు జీతాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. దీని తాలూకు రూ. 11,06,83,571 చెక్కును పోలీసు ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డి చేతికి అందజేశారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం జరిగిన ఎస్సై పాసింగ్ పరేడ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రికి డీజీపీ జితేందర్ తెలంగాణ పోలీసుల తరఫున చెక్‌ను అందించడం జరిగింది.

## ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తుతా..!

న్యూఢిల్లీ,: తాను క్రీడల్లో సత్తా చాటడం ఒక్కటే కాదని, తన ప్రాంత ప్రజలకు రోడ్లు, విద్యుత్, మంచినీరు సహా అన్ని సదుపాయాలూ సమకూర్చేందుకు పోరాడతానని జులానా అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్ పేర్కొన్నారు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో తాము విజయం సాధిస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీలో తాను ప్రజాసమస్యలను ప్రస్తావిస్తూ వారి తరఫున గొంతెత్తుతానని చెప్పారు. జింద్‌లో ఆమె బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. జంతర్‌మంతర్ వద్ద తాము నిరసనలను ప్రారంభించే క్రమంలో అందుకు అవసరమైన అనుమతులను ఇద్దరు బీజేపీ నేతలే తమకు ఇప్పించారని చెప్పారు. తమ పోరాటం కొనసాగిస్తామని వినేశ్ ఫోగట్ స్పష్టం చేశారు. ఇక హరియాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా బిజీబిజీగా గడుపుతున్నారు. సభలు, ర్యాలీలతో హోరెత్తిస్తూ విరామంలో మీడియా ప్రతినిధులతో ముచ్చటిస్తున్నారు. హరియాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 2005 నుంచి 2014 వరకూ పదేండ్ల తమ ప్రభుత్వ హయాంలో హరియాణ అభివృద్ధికి చిహ్నంలా ఉండేదని గుర్తుచేసుకున్నారు. కాషాయ సర్కార్‌ను సాగనంపేందుకు రాష్ట్ర ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావాలని ప్రజలు నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే హరియాణను మళ్లీ అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకువెళతామని స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీ ఇంటి వద్ద ఉద్రిక్తత.. క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్

ఢిల్లీ: లోక్ సభ విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో.. సిక్కులపై చేసిన వ్యా?ౌలను బీజేపీ నేతలు ఖండిస్తున్నారు. రాహుల్ వ్యాఖ్యలు సిక్కు సమాజాన్ని అవమానించే విధంగా ఉన్నాయంటూ ఆ పార్టీ సిక్కు సెల్ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ ఇంటిని వారు ముట్టడించారు. రాహుల్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి, నినాదాలు చేశారు. తొలుత విజ్ఞాన్ భవన్ నుండి ర్యాలీగా బయలుదేరి రాహుల్ నివసిస్తున్న 10 జనపథ్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ వారిని పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులు, పోలీసులకు తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. "రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి. విదేశాల్లో ఆయన భారత్ పరువు తీస్తున్నారు. సిక్కుల తలపాగపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు" అని బీజేపీ నేత ఆర్‌పి సింగ్ అన్నారు. దేశంలో 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లకు కాంగ్రెస్సే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.

రాహుల్ ఏమన్నారంటే..

ఆర్ఎస్ఎస్ .. కొన్ని రాష్ట్రాలు, మతాలు, భాషలు, వర్గ ప్రజలను తక్కువ అన్న అభిప్రాయంతో చూస్తోందని రాహుల్ ఆరోపించారు. అలాగే భారత్‌లో సిక్కు మతస్థులను తలపాగా పెట్టుకునే అవకాశాన్ని కల్పిస్తారో లేదో అని, సిక్కులకు గురుద్వారా వెళ్లనిస్తారో లేదో అంటూ వ్యాఖ్యానించారు. దేశంలో జరుగుతున్నది రాజకీయ పోరాటం కాదని పేర్కొన్నారు.

దేశద్రోహ వ్యాఖ్యలు..

రాహుల్ వ్యాఖ్యలపై కేంద్రమంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను మంటగలుపుతున్నారని ధ్వజమెత్తారు. సిక్కులను ఇక్కడ తలపాగాలు ధరించేందుకు అనుమతించరన్న రాహుల్ వ్యాఖ్యల్లో నిజం లేదని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి అన్నారు. తాను ఆరు దశాబ్దాలుగా తలపాగాను ధరిస్తున్నానని చెప్పారు. 1947 తర్వాత తొలిసారి మోదీ హయాంలోనే సిక్కులు సురక్షితంగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం అధికారంలో ఉన్నప్పుడే సిక్కులు అభద్రతతో బతికారని ఆరోపించారు. 1984లో సిక్కులను ఊచకోత కోశారని, 3 వేలమంది ప్రాణాలు బలిగొన్నారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన సిక్కుల ఊచకోతను రాహుల్ ఎలా మరిచిపోయారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే సిక్కుల తలపాగాలను తీసి తనిఖీ చేశారని, ఎందరో సిక్కుల గడ్డాలను కత్తిరించారన్నారు. విదేశాల్లో భారతదేశ ప్రతిష్ఠను దిగజార్చడం దేశద్రోహమేనని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ విమర్శించారు.

## రాహుల్ గాంధీ, కేసీఆర్‌పై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. విదేశాల్లో పర్యటిస్తూ భారత్‌ను కించపర్చడమే కాకుండా ఎన్నికల వ్యవస్థను విమర్శిస్తున్న రాహుల్ గాంధీకి ఈ దేశంలో ఉండే అర్హత లేదని వ్యాఖ్యానించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి ఎస్సార్ కన్వెన్షన్ హాల్‌లో రంగారెడ్డి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కూన రవికుమార్, తదితర నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'మిస్టర్ రాహుల్ గాంధీ.. క్విట్ ఇండియా' అని అన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలిసి పోటీ చేయబోతున్నాయన్నారు. అందరూ కలిసి పోటీ చేసినా ఈసారి జీహెచ్ఎంసీపై కాషాయ జెండాను ఎగురవేసి తీరుతామని, మేయర్ పదవిని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సభ్యత్వ నమోదు విషయంలో అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఇన్సూరెన్స్, ఇతర తాయిలాలు ఆశ చూపకుండా సభ్యత్వ నమోదు చేస్తోందన్నారు. బీజేపీ జాతీయవాద భావాలున్న పార్టీ అని అన్నారు. దేశం కోసం ప్రాణాలిచ్చే పార్టీ అని వ్యాఖ్యానించారు అట్టడుగునున్న పేదవాడికి సైతం ప్రభుత్వ ఫలాలు అందించాలని అంత్యోదయ సిద్ధాంతం పనిచేస్తున్న పార్టీ బీజేపీ అని చెప్పారు. బీజేపీ ప్రభుత్వ హాయంలో దేశంలోని 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. దేశానికి మేలు చేసే అనేక పనులు చేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైల్లో వేస్తాడనుకున్న.. కానీ, రేవంత్‌తో సాధ్యం కావడం లేదు. ఎందుకంటే కేసీఆర్‌కు కాంగ్రెస్‌లో ఎవరిని పట్టుకుంటే పనైతదో తెలుసు. అందుకే ఢిల్లీ పోయి కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడుకుని వచ్చిండు.. అందుకే కేసీఆర్ కుటుంబం జోలికి రేవంత్ వెళ్లడం లేదని అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఒకవేళ బీజేపీ అధికారంలోకి వచ్చివుంటే కేసీఆర్ కుటుంబాన్ని.. అంకుశం సినిమాలో రాంరెడ్డిని ఎట్లా గుంజుకుపోయి జైల్లో వేశారో.. అలానే జైల్లో వేసేవాళ్లమని చెప్పారు. ఎందుకంటే కేసీఆర్ అన్ని అరాచకాలు చేశారన్నారు. 2028లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని బండి సంజయ్ అన్నారు.

# అక్కడ ఇళ్ళు కట్టాలంటే హైడ్రా పర్మిషన్.. రేవంత్ సర్కార్ సెన్సేషన్!

హైదరాబాద్, :ప్రభుత్వ భూములలో ఆక్రమణలను తొలగించడం కోసం, చెరువులను కబ్జా చేసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడం కోసం, ఎఫ్టిఎల్ పరిధిలోను, బఫర్ జోన్లలో ఆక్రమణలను తొలగించడం కోసం, చెరువులను పరిరక్షించడం కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా మంచి గుర్తింపు వస్తున్న విషయం తెలిసిందే.

దూకుడుగా హైడ్రా

హైడ్రా వ్యవస్థ ఒక్క హైదరాబాద్లో మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోనూ ఇంప్లిమెంట్ చేయాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ కూడా వినిపిస్తుంది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ దూకుడుగా కూల్చివేతల పర్వాన్ని కొనసాగిస్తుంది.

హైదరాబాద్ ల నిర్మాణాలకు హైడ్రా అనుమతిపై ప్రభుత్వ యోచన

ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది. ప్రభుత్వం మంజూరు చేసే బిల్డింగ్ పర్మిషన్ల ప్రక్రియలోనూ హైడ్రాను చేర్చాలని నిర్ణయించినట్లు సమాచారం. హైదరాబాద్ నగరంలో ఇళ్ల నిర్మాణాలకు ఇకనుంచి హైడ్రాను కొత్త నిబంధనల అనుమతుల ప్రక్రియలో చేర్చే ఆలోచనలో తెలంగాణ ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.



హైడ్రా ఎన్ఓసీ ఇస్తేనే ఇంటి నిర్మాణం

ఇకనుంచి హైదరాబాద్ నగరంలో ఎవరైనా ఇంటి నిర్మాణం కోసం పర్మిషన్ తీసుకోవాలంటే హైడ్రా నుండి కూడా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని ఈ నిర్ణయం యొక్క సారాంశం. అంతే కాదు ఎఫ్ టీ ఎల్ పరిధి, బఫర్ జోన్ల పరిధిలో హైడ్రా అనుమతి లేకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే ఆ ఇంటి నెంబర్లను, కరెంటు కనెక్షన్లను, నల్ల కనెక్షన్లను తొలగించనున్నట్టు తెలుస్తుంది.

ప్రభుత్వ నిర్ణయం పేద, మధ్యతరగతి ప్రజలు నష్టపోకుండా ఉండటం కోసమే

పేద మధ్యతరగతి ప్రజలు నష్టపోకుండా ఉండడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. ఇదే గనక జరిగితే హైదరాబాదులో ఇకపై భవన నిర్మాణాన్ని చేయాలనుకునేవారు ముఖ్యంగా ఎఫ్టిఎల్ మరియు బఫర్ జోన్ పరిధిలో నిర్మాణాలు చేయాలనుకునేవారు హైడ్రా అనుమతి కోసం కూడా అప్లై చేసుకోవాలి. హైడ్రా అనుమతి ఇస్తేనే నిర్మాణం, లేదంటే అక్కడ నిర్మాణం చేయడానికి వీలు లేదు అని ఖచ్చితమైన నిర్ధారణ.

## బత్తుల దీక్షిత్ మరణం పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కొమిరెడ్డి జ్యోతక్క



మెట్ పల్లి(గౌతమ్ న్యూస్): పట్టణం లొ తమ కుటుంబానికి అత్యంత ఆప్తులు సన్నిహితుడైన న్యాయవాది బత్తుల దీక్షిత్ మృతి తమను తీవ్రంగా కలచి వేసిందని మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కొమిరెడ్డి జ్యోతక్క ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాదు నుండి చరవాణి ద్వారా మెట్పల్లి లోని స్థానిక విలేకరులతో మాట్లాడారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న బత్తుల దీక్షిత్ కుటుంబానితో తమకు సుదీర్ఘకాలంగా అత్యంత అనుబంధం ఉన్నదని, రాజకీయ సహచరుడిగా తమ వెన్నంటి నడిచిన బత్తుల దీక్షిత్ మరణం తమకు వ్యక్తిగతంగా జీర్ణించుకోలేనిదని, చిన్న వయసులోనే ఆకాలమరణం చెందిన బత్తుల దీక్షిత్ మరణంపై సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యుల కు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు

## జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిపిఐ ఆందోళన!!




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి తెలంగాణ రాష్ట్రాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 12న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిపిఐ పార్టీ ప్రకటించింది,రాష్ట్రవ్యాప్తంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ఆందోళన కార్యక్రమం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ప్రతి ఒక్కరు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పార్టీ పిలుపునిచ్చింది, వరదల వల్ల తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం సామాన్యప్రజానీకంజీవన విధానం అస్తవ్యస్తంగా తయారైందని ఎక్కడ చూసినా పంట నష్టం ఆస్తి నష్టం, రోడ్లు భవనాలు, విద్యుత్, వంటి అనేక మౌలిక వసతులకు నష్టం మారిందని కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తుంది, పార్టీల కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వం వరద అంచనాలను వేయడం మర్చిపోవడం వంటి అలవాటు మానుకోవాలని వెంటనే కేంద్రానికి వచ్చిన బృందం నివేదిక ప్రకారం నిధులు విడుదల చేసి జాతీయ విపత్తుగా ప్రభుత్వం ప్రకటించి ఈ రాష్ట్ర ప్రజలను అన్ని రకాల ఆదుకోవాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేసింది,


## వట్టి వాగు వద్ద పారిశుద్ధ్య పనులను .పరిశీలించినా

### మున్సిపల్ కమిషనర్ మోహన్



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): పట్టణం లొ ఆర్డిఓ ఎన్ శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ మోహన్ డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు వట్టి వాగు పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించినారు కమిషనర్ మాట్లాడుతూ గణపతి నిమజ్జనం కొరకు పరిసరాలను పరిశుభ్రం చేయించాలని గణపతి నిమజ్జనం వచ్చే రోడ్లు గుంతలలో మొరం పోయించాలని వట్టివాగు వద్ద వచ్చే దారిలో మొరం పోయించి దానిపైన చిప్స్ పోయించాలని గణపతి ని సిబ్బందికి ఆదేశించినారు నిమజ్జనం రోజు లైటింగ్ ఏర్పాటు చేసి తాగడానికి మంచినీరు గణపతి మండపాల నుంచి వచ్చే పూజ సామ్రాగ్ధి తరలించడానికి ఆటోలను ఏర్పాటు చేయాలని తెలిపినారు వాగు పరిసరాలను ఎవరు వెళ్లకుండా భారీ కేడ్లు ఏర్పాటుచేసి మున్సిపల్ సిబ్బందిని ఉంచాలని తెలిపినారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్ డి ఈ నాగేశ్వరరావు ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు ఏఈ తిరుపతి ఎస్సైలు చిరంజీవి రాజు ముజీబ్ నిజాం అశోక్ నరేష్ శేఖర్ మహేష్ పాల్గొన్నారు

## ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ఏడిఏ లాల్ చందు



టేకులపల్లి(గౌతమ్ న్యూస్): పిఎసిఎస్ ఎరువుల దుకాణాన్ని బుధవారం ఇల్లందు వ్యవసాయ అధికారి లాల్ చంద్, బుధవారం తనిఖీ చేయడం జరిగింది , షాపులో ఉన్న స్టాకును మరియు స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించి,



స్టాక్ అమ్మిన వివరాలు వెంటనే స్టాక్ రిజిస్టర్ బుక్ లో నమోదు చేయాలని, ఫెర్టిలైజర్ పెస్టి సైడ్స్ కరెక్ట్ గా ఉండాలని అన్నారు రైతుల వెంట ఆటోలు లేదా ట్రాలీలు



తెచ్చుకున్న తర్వాతే మందు కట్టాల బిల్లు కొట్టాలని లేనియెడల బిల్లు ఇవ్వకూడదని తెలియజేశారు. పి ఏ సి ఎస్ స్టాక్ బోర్డును గ్రీన్ బోర్డు గా మార్చాలన్నారు, గోధామును తనిఖీ చేసి అందులో ఉన్న మందు కట్టలను లాటుగా వేసి వాటికి ట్యాగులు వేసి క్రమసంఖ్య రాయాలని వారు తెలియజేశారు అనంతరం రుణమాఫీ విషయంలో రైతులకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ రమేష్ ,హుసేన్, చారీ, తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన- కలెక్టర్ జి.సత్యప్రసాద్



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): పట్టణంలో బుధవారం రోజున వట్టి వాగువద్ద నిమజ్జనం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి సత్యప్రసాద్ పరిశీలించినారు కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జనం రోజున రెండు క్రేన్లు ఒక చైన్ మిషిన్ ఏర్పాటు చేసి మూడు పాయింట్లు



పెట్టాలని ఆదేశించినారు వట్టి వాగు చుట్టూ బారికేడ్లు,లైటింగ్,జనరేటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్పీ అశోక్ కుమార్, ఆర్డీవో శ్రీనివాస్,డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ టీ మోహన్,ఎమ్మార్వో శ్రీనివాస్, డి ఈ నాగేశ్వరరావు, ఇంచార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఏఈ తిరుపతి, ముజీబ్, ఎస్సై చిరంజీవి,నిజాం, అశోక్, మహేష్, శేఖర్ పాల్గొన్నారు

## సింగరేణి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోఆర్డినేటర్ రాంబాబుకు

### సింగరేణి అధికారులు,ఏఐటీయూసీ నాయకులు అభినందనలు తెలిపారు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : సింగరేణి ఎస్ అండ్ పిసి ఫిట్ కార్యదర్శి (ఏఐటీయూసీ) జే. రాంబాబు సింగరేణి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కో ఆర్డినేటర్ గా ఎన్నికైనా సందర్భంగ కోఆర్డినేటర్ పత్రాన్ని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం షాలెం రాజు చేతుల మీదుగా అందుకున్న రాంబాబు కి డిప్యూటీ జనరల్ మేనేజర్ (పర్సనల్) బి. శివ కేశవరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గనిగల వీరస్వామి, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ సహాయ కార్యదర్శి జక్కుల గట్టయ్య, సింగరేణి డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్రావణ్, జనరల్ కెప్టెన్ కందుకూరి నాగమోహన్, ఐఎన్టియుసి జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ సిహెచ్ సాగర్ తదితరులు అభినందనలు తెలిపారు.

# పిసిసి అధ్యక్షులు ప్రమాణ స్వీకారానికి తరలిరండి!!

## వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ పిలుపు!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): ఈనెల 15న తెలంగాణ రాష్ట్ర నూతన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరావాలని వనపర్తి మార్కెట్ కమిటీ







చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు, తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ. ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు, ఈ నెల 15వ తేదీన గాంధీభవన్లో జరిగే నూతన తెలంగాణ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి గౌడ కుల సంఘాలతో పాటు బహుజన కులాలకు చెందిన వారంతా పెద్ద ఎత్తున తరలిరావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ ,తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలికట్టే విజయ్ కుమార్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ లు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 ఏళ్ల తర్వాత గౌడ జాతికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్ష పదవి అప్పగించడం హర్షనీయమని పదవి అప్పగించిన జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ కర్గే. పార్టీ జాతీయ ముఖ్య నాయకులు సోనియా గాంధీ రాహుల్ గాంధీ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. మహేష్ గౌడ్ కు అధ్యక్ష పదవి అప్పగించడం వల్ల బలహీనవర్గాల వారికి సంపూర్ణ న్యాయం జరిగిందన్నారు. త్వరలో అన్ని గౌడ సంఘాల ఆధ్వర్యంలో మహేష్ కుమార్ గౌడ్ కు పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అంతేకాకుండా మూడు నెలల్లో కుల గణన చేపట్టాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని చెప్పారు. తెలంగాణ గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌని వెంకటేష్ గౌడ్. గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణ గౌడ్ పోతగాని ఐలన గౌడ్ తదితరులు హాజరవుతున్నారని ఈ కార్యక్రమానికి తెలంగాణలోని గౌడ కులస్తులు బహుజనులు అధిక సంఖ్యలో హాజరై పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ ప్రమాణస్వీకారం విజయవంతం చేయాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు,

## కనుమరుగైన డిజె సౌండ్ ల మోత!! భక్తిశ్రద్ధల మధ్య గణనాథుని పూజలు!?

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వినాయక చవితి వచ్చిందంటే చాలు ఎక్కడ చూసినా మారుమూల ప్రాంతాలతో సైతం పట్టణ ప్రాంతాలలో వినాయక మండపాల దగ్గర డిజె సౌండ్ల మోత డాన్సులు, చెవులు చిలుమనే శబ్దాలు, వినిపిస్తాయి కానీ ఈ సంవత్సరం డీజే సౌండ్ మోతలకు స్వస్తి పలికారు, ఈనెల 7న దేశవ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి సందర్భంగా హిందువులకు అతి పవిత్రమైన ఈ పండుగ పాత్ర పాదశుద్ధ చవతి



రోజు ప్రారంభమై తొమ్మిది రోజులు పూజలు అందుకున్న గణనాథునికి ఘనంగా పూజలు అందించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేస్తారు, ఈ సంవత్సరం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవడం కుంటలు, చెరువులు, వాగులు, రిజర్వాయర్లు పూర్తిగా నిండిపోయి జలకలను సంతరించుకున్నది, వినాయకుని నిమజ్జనానికి ఈ భారీ వర్షాలు ఎంత ఊరట కలిగించాయి, గతంలో వినాయక చవితి పండగ రోజు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడం ఒక ఎత్తు ఆ తర్వాత పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జనం చేయడానికి చుక్క మీరు కూడా దొరకని పరిస్థితి చూసిన రోజులు ఉన్నాయి, కానీ ఈ సంవత్సరం నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆటంకం లేకుండా భక్తులు ఆనందోత్సవాల మధ్య నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు, గతంలో నిమజ్జనం చేయాలంటే దాదాపు 100 కిలోమీటర్ల వరకు వినాయకుని తరలించి నిమజ్జనం చేసిన రోజులు గుర్తు చేసుకుంటున్నారు, కొన్నిచోట్ల ఐదు రోజులు మరికొన్నిచోట్ల 11 రోజులు తర్వాత గణేష్ విగ్రహాలను నిమగ్నం

# గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం!!





చేస్తున్నారు, ఇది ఇలా ఉన్నప్పటికీ వినాయక చవితి రోజు నుంచి నిమజ్జనం పూర్తి అయ్యేవరకు డీజే సౌండ్ డిజె సౌండ్ బాక్స్ లను పెట్టకుండా పోలీసులు కఠినంగా నిర్ణయం తీసుకున్నారు, వినాయక మండపాల దగ్గర డాన్సులు, నృత్యాలు, సినిమా పాటలు, హిందూ సంస్కృతిని దెబ్బతీసే కార్యక్రమాలకు స్వస్తి పలుకుతూ భక్తిశ్రద్ధలతో భక్తి పాటలతో గణేష్ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు, ఈ సందర్భంగా పోలీసులు నిమజ్జనం రోజు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు, వనపర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట, గద్వాల, నారాయణపేట, మహబూబ్నగర్, జడ్చర్ల ,



దేవరకద్ర, తో పాటు ప్రతి నియోజకవర్గం మండల కేంద్రాలలో గ్రామాలలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకున్నారు,

# సాయుధ పోరాట స్ఫూర్తితో నయా దోపిడికి వ్యతిరేకంగా పోరాడాలి




## సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా. రావి నారాయణ రెడ్డి స్తూపం వద్ద ఘనంగా 76వ తెలంగాణ విలీన దినోత్సవం.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : నైజాం నిరంకుశపాలన అంతంకోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిగా కేంద్ర, రాష్ట్ర నయాదోపిడికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. తెలంగాణ 76వ విలీనదినోత్సవాన్ని పురస్కరించుకొని సుజాతనగర్ మండలం నాయకులగూడెంలోని తెలంగాణ సాయుధ పోరాట యోధులు రావి నారాయణరెడ్డి స్తూపం వద్ద వారోత్సవాలని అయన ప్రారంభించారు. తొలుత ఎర్ర జెండాను ఆవిష్కరించిన అనంతరం అమరవీరులకు నివాలులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో అయ మాట్లాడుతూ నాటి మహత్తర పోరాటాన్ని బిజెపి హైజాక్ చేసేందుకు యత్నిస్తుందని, రాచరికానికి, నిర్బంధానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఎంఐఎం సైతం ముస్లింలను ఊచకోత కోశారని తప్పుడు ప్రచారం చేస్తుందని పేర్కొన్నారు. సాయుధ పోరాటంలో నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడిన వారిలో అన్ని వర్గాల వారు ప్రాణత్యాగం చేశారని బిజెపి, ఎంఐఎం గుర్తుంచుకోవాలన్నారు. కమ్యూనిస్టులు చేపట్టిన వీరోచిత పోరాటాలను తట్టుకోలేకనే నైజాం రాజు హైద్రాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన సుదినం సెప్టెంబర్ 17 అని, సెప్టెంబర్ 11 సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన రోజని పేర్కొన్నారు. నాడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో జమీందార్లు, నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టులదేనన్నారు. నిజాం నిరంకుశపాలనలో మాతృభాషలో విద్యాబోధన నిషేదం, వెట్టి చాకిరి, నిరుద్యోగం, నిరక్షరాస్యత, దారిద్ర్యం ప్రజలను పట్టి పీడించాయని, అలాంటి పరిస్థితులే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొంటున్నాయని అన్నారు. సాయుధ పోరాట అమరులు ఆశించిన లక్ష్యాల సాధన దిశగా పోరాటాలు ముమ్మరం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ అమరుడు కోమారి రామయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు భూక్యా దస్రు, కంచర్ల జమలయ్య, కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, భూక్య శ్రీనివాస్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### కెంచ రాజమణి కుటుంబాన్ని పరామర్శించిన చిలువేరు సమ్మయ్య గౌడ్




మానుకోట జిల్లా ప్రతినిధి/(గౌతమ్ న్యూస్): మానుకోట జిల్లా కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామానికి చెందిన కెంచ మొగిలి భార్య కేంచ రాజమణి ఇటీవల బైక్ పై నుండి జారిపడి మృతి చెందగా విషయం తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి వారి కుమారులు రాధాకృష్ణ, సూర్యకుమార్ లను పరామర్శించిన సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబానికి సమ్మయ్య గౌడ్ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భరోసా కల్పించారు. ఈ పరామర్శలో పాల్గొన్న సమ్మి గౌడ్ ఫౌండేషన్ సభ్యులు ఎర్రం శెట్టి అశోక్, చిలువేరు సాయి గౌడ్, పబ్బతి ప్రశాంత్ గౌడ్, చాగంటి రాము, గంధసిరి సోమన్న, మోడం రాజు, షేక్ జానీ, మహమ్మద్ సైదులు, చిట్టె కుమార్, కందల శ్రీకాంత్, రఫీ, సింగని వేణు తదితరులు ఉన్నారు.

## గణపతి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం.





బయ్యారం(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా బయ్యారం: మండలం బస్టాండ్ కోటి సెంటర్ లో ఏర్పాటు చేసినటువంటి గణేష్ మండపం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో బాగా మండపం వద్ద గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గణపతి



నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా మహా గణపతిని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను సంతోషంగా నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసినందుకు కోటి సెంటర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు..

## ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్

### వరద సాయం కోసం నేడు అమిత్‌షాతో భేటీ
### టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ కూడా ఢిల్లీకి
### కాంగ్రెస్ అధిష్టానం పెద్దలను కలవనున్న నేతలు



న్యూఢిల్లీ/హైదరాబాద్, : సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీకి చేరుకున్నారు. గురువారం ఆయన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలవనున్నారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టానికి సంబంధించి అంచనాల నివేదికను అమిషాకు సమర్పించి కేంద్ర సాయం కోరనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి.. ఇతర కేంద్ర మంత్రులను కూడా కలిసి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని కోరనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన మహేశ్‌కుమార్ గౌడ్ కూడా బుధవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. గురవారం సీఎంతో కలిసి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తోపాటు అగ్రనేత సోనియాగాంధీని మహేశ్‌కుమార్ గౌడ్ కలుసుకోనున్నారు. తనను పీసీసీ చీఫ్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలపనున్నారు. కాగా, కాంగ్రెసలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై 4వారాల్లో నిర్ణయం తీసుకోవాలన్న హైకోర్టు తీర్పు అంశాన్ని అధిష్ఠానం దృష్టికి సీఎం రేవంత్ తీసుకెళ్లే అవకాశాలున్నాయి. మరోవైపు బుధవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్న మంత్రి పొన్నం క్రిబ్కో చైర్మన్ చంద్రపాల్‌సింగ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.

## సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం

### కొత్తగా నామకరణం చేసిన రేవంత్ సర్కారు
### బీఆర్ఎస్ హయాంలో 'జాతీయ సమైక్యతా దినం'..
### విమోచన దినోత్సవంగా ప్రకటించిన కేంద్రం





హైదరాబాద్,: నిజాం చెర నుంచి తెలంగాణ విముక్తి పొంది, అఖండ భారత్‌లో విలీనమైన సెప్టెంబరు 17వ తేదీని 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం'గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కొత్తగా నామకరణం చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ ఉత్సవాన్ని రాజధాని హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం చేయకుండా.. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 17న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపింది. మిగిలిన 32 జిల్లాల్లో ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. జిల్లా కేంద్రాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే బాధ్యతను మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లకు డిజిగ్నేట్ చేసింది. తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచీ సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాలన్న డిమాండ్‌ను వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు చేస్తున్నాయి. ప్రధాన పార్టీలు ఆయా పార్టీల కార్యాలయాల్లో వేర్వేరు పేర్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహిస్తుండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు రాలేదు. కానీ, గత ఎన్నికలకు ముందు మాత్రం సెప్టెంబరు 17ను జాతీయ సమైక్యతా దినోత్సవంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. మరోవైపు కేంద్రంలోని బీజేపీ దీనిని తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించి నిర్వహించింది. గత ఏడాది రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. సెప్టెంబరు 17ను ఏ పేరుతో నిర్వహిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దానికి తెరదించుతూ.. తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవంగా నిర్వహించనున్నట్లు సర్కారు స్పష్టత ఇచ్చింది.

## మెడికల్ క్యాంపులను సందర్శించి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్

మానుకోట జిల్లా ప్రతినిధి(గౌతమ్ న్యూస్): బుధవారం మానుకోట జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ మరియు కీటక జనిత ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడున్న రోగులకు సీజనల్ వ్యాధులు మీద అవగాహన కల్పిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, అంటూ వ్యాధులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. అలాగే వరద ముంపు ప్రాంతాలు సీతారాం తండా, బాలిని ధర్మారం మెడికల్ క్యాంపులను సందర్శించి అక్కడున్న సిబ్బందికి ప్రతి ఇంటిని సందర్శించి జ్వర సర్వే చేస్తూ, ఎవరికైనా జ్వరము ఉన్నట్లయితే మలేరియా మరియు డెంగ్యూ ఆర్‌డిటి కిట్లతో రక్తపరీక్ష చేసి మందులు ఇవ్వాలని, ఈ ప్రాంతాలలో దోమలు ప్రబలకుండా, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా, రాకుండా తీమోపాస్, పైరిత్రం స్ప్రే మరియు త్రాగునీటి వనరులను క్లోరినేషన్ చేయించాలని సూచనలు ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా ప్రతి మండలానికి ఐదు లీటర్ల మలాథిన్, ఐదు లీటర్ల థీమోపాస్ పంపిణీ




చేయాలని ఎన్ సి బి డి సి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్ ఆదేశించడం జరిగినది. జిల్లా పంచాయతీ శాఖ ద్వారా ప్రతి గ్రామాలలో మరియు తండాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా మరియు కీటక జనిత వ్యాధులు సంభవించకుండా స్ప్రే మరియు ఫాగింగ్ చేయాలని, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రవి, జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ ఒబిలిశెట్టి రామకృష్ణ, ఎం ఎల్ హెచ్ పి అఖిల, సిస్టర్ రాములమ్మ మరియు ఆశలు పాల్గొన్నారు.

## పోలీసుల ఒక్కరోజు జీతాన్ని విరాళంగా ప్రకటించిన డీజీపీ!

హైదరాబాద్(గౌతమ్ న్యూస్): ఇవ్వాళ తెలంగాణ పోలీస్ అకాడమీలో పాసింగ్ అవుట్ పెరేడ్ నిర్వహిం చారు. పాసింగ్ అవుట్ పరేడ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణలో వరద బాధితుల సహాయార్థం పోలీసులు ఒక్కరోజు జీతాన్ని విరాళంగా అందజేశారు.మొత్తం రూ"11.06కోట్లు ఇచ్చారు. దీనికి సంబంధించి చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి, డిజిపీ జితేందర్, అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ....ఆక్రమణలను విడిచిపెట్టి వెళ్లాలని, లేదంటే నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు.చెరువులను చెరపడితే చేరసాలే అన్నారు. ఎఫ్టీఎల్, నాలా, బఫర్ జోన్ రెగ్యులరైస్ స్కీం లేదన్నా రు. ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులదేనన్నారు. సైనిక స్కూల్ తరహాలో పోలీసు లకు 50ఎకరాల్లో పోలీసు రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రక్షాళన చెయ్యడానికే కొత్తకోటకు విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ అప్పగించామ న్నారు. పోలీసులంటే సమాజంలో చేతులెత్తి నమస్కరించాలన్నారు. మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత నాదేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కని పెంచిన తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేలా యువత సక్రమమైన దారిలో నడవాలన్ని ఆకాంక్షించారు. ఉద్యోగాల కల్పనకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, తెలంగాణ పిఎస్ సి లో అక్రమాలకు తావు లేకుండా ఆ సంస్థను ఇప్పటికే పూర్తిగా ప్రక్షాళన చేశామని తెలిపారు. ఈ ఏడాదిలోనే మరో 35 వేల ఉద్యోగల భర్తీ చేస్తా మన అన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెలవేర లేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పనితీరుపై యువ కులకు ఎలాంటి అనుమా నాలు అక్కర్లేదని అన్నారు. కొందరు చెడు వ్యసనాలకు అలవాటు పడి డ్రగ్స్‌ను విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కొత్తగా




చేరిన వారు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా డ్రగ్స్, గంజాయి వ్యసనాలకు స్థానం ఉండకుండా చేయాలన్నారు. ఇప్పటికే 22 లక్షల మంది రైతులకు రుణ మాఫీ చేశామని గుర్తు చేశారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తితో దొరల పాలన అంతం

### ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పాలకుర్తి (గౌతమ్ న్యూస్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో విరోచితంగా పోరాటం చేసిన చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తెలంగాణతో పాటు పాలకుర్తిలో దొరల పాలనను పాలకుర్తి ప్రజలు తిరుగుబాటు చేసి అంతం చేశారని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతిని పురస్కరించుకొని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన వర్ధంతి కార్యక్రమం సందర్భంగా మంగళవారం పాలకుర్తి ఐలమ్మ సెంటర్లో ఐలమ్మ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి తో కలిసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన వీర తెలంగాణ వీధి నాటికను కళ్ళకు అద్దినట్టుగా కళాకారులు ప్రదర్శించడంతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిలు తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ భూ పోరాటం మరువలేని దన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతి లను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. గడీల పాలనను అంతమొందించడంలో పాలకుర్తి ప్రజల్లో చైతన్యం ఉందని, అదే స్ఫూర్తితో దొరల పాలనను అంతమొందించారని తెలిపారు. కళాకారులందరికీ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఐలమ్మ వర్ధంతి, జయంతి వేడుకలను నిర్వహించేందుకు ప్రభుత్వం 15 లక్షలు కేటాయించిందని తెలిపారు. ఐలమ్మ పేరున భవనం నిర్మించేందుకు ఒక ఎకరం స్థలాన్ని కేటాయించామని తెలిపారు. ఐలమ్మ పుట్టిన గడ్డకు ఎమ్మెల్యే కావడం ఆనందంగా ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే ప్రజా ప్రభుత్వమని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పాలకుర్తి నియోజకవర్గం వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఐలమ్మ



భూ పోరాట స్ఫూర్తితో పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని అన్నారు. గత పది ఏళ్లలో పాలకుర్తి నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు.

**మహిళ శక్తి చాకలి ఐలమ్మ :**

ప్రజలను చైతన్యం చేసి దొరల ఆగడాలను ఎదిరించి తిరుగుబాటు చేయడంలో చాకలి ఐలమ్మ మహిళ శక్తిగా ఎదిగిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన వీర తెలంగాణ వీధి నాటికను తిలకించిన ఝాన్సీ రెడ్డి 1950లో ఉన్నామా 2024 లో ఉన్నామా అని ప్రశ్నించుకున్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలను కళ్ళకు కట్టినట్లుగా కళాకారులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. పాలకుర్తి కి పోరాటాల గడ్డ అని పేరు ఉందని తెలిపారు. దొర గడీల పాలనను బద్దలు కొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ అని గుర్తు చేశారు. ఐలమ్మ పోరాట, ఆశయ స్ఫూర్తితో పాలకుర్తి ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాధ్యమని, విజయం సాధించామని అన్నారు. అమెరికా నుండి పాలకుర్తి ప్రజలకు సేవ చేసి పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకే పాలకుర్తికి వచ్చామని ఝాన్సీ రెడ్డి తెలిపారు.

## పీసీసీ అధ్యక్షులుగా మహేశ్వర్ గౌడ్ ఎంపిక పై మోకుదెబ్బ హర్షం

నర్సంపేట(గౌతమ్ న్యూస్): తెలంగాణ పీసీసీ అధ్యక్షులుగా బొమ్మ మహేశ్వర్ గౌడ్ ను ఎంపిక చేయడం హర్షనీయమని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.నర్సంపేట పట్టణం మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం పట్టణ కమిటీ అధ్యక్షులు గండి గిరి గౌడ్ అధ్యక్షతన బుధ వారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆయన సేవలను ఏఐసీసీ గుర్తించి పార్టీ లో అత్యున్నతమైన పీసీసీ అధ్యక్షులుగా మహేశ్వర్ గౌడ్ ను నియమించడం జరిగిందన్నారు. విద్యార్థి స్థాయి నుండి ఒక సైనికుని వలె నిబద్ధత గల కార్యకర్తగా చేసిన సేవలను చూసి పదవి కట్టబెట్టడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. గౌడ సామాజిక వర్గాన్ని గుర్తించి మహేశ్వర్ గౌడ్ పీసీసీ అధ్యక్షులుగా నియమించిన ఏఐసీసీ అధ్యక్షులు కార్గే, సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మోకుదెబ్బ పక్షాన కృతజ్ఞతలు తెలుపున్నట్లు రమేష్ గౌడ్ తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌడ సామాజిక వర్గానికి అన్ని పార్టీలు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని, ఎన్నికల మేనిపెస్టో లో ప్రకటించినట్లుగా కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా కు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు నామకరణం చేయాలని రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్, మాజీ ఎంపీపీ బూర్గు రవీందర్ గౌడ్, మాజీ ఎంపిటీసీ కట్ల సుధాకర్ గౌడ్, జిల్లా ప్రధాన



కార్యదర్శి బుడిగె మల్లేష్ , నాలం విజయ్ కుమార్ గౌడ్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ మేరుగు శ్రీనివాస్ గౌడ్, బోడిగే వినయ్ గౌడ్, వేముల రవి గౌడ్, బుర్ర ఆనందం గౌడ్, కక్కెర్ల కుమార్ గౌడ్, బత్తిని సాంబయ్య గౌడ్, దుపాటి మల్లయ్య గౌడ్, కట్ల కనుకయ్య గౌడ్, బూడిద రవీందర్ గౌడ్, తాళ్లపెల్లి అశోక్ గౌడ్, బత్తిని అశోక్ గౌడ్, దుపాటి కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంజీ భూములపై సీబీఐ విచారణకు
# తెలంగాణ హైకోర్టు నిరాకరణ



హైదరాబాద్,: ఐఎంజీ అకాడెమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్)కు భూముల అక్రమ కేటాయింపుపై విచారణకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. ఐఎంజీకి కేటాయించిన భూములపై సీబీఐ విచారణ జరిపించాలన్న పిటిషన్లను బుధవారం హైకోర్టు కొట్టివేసింది. అక్రమాలు జరిగినట్లు సరైన ఆధారాలు లేవని హైకోర్టు తేల్చింది. 2004కు ముందే ఐఎంజీకి 850 ఎకరాలు భూమి కేటాయించినట్లు తెలిపింది. సెప్టెంబర్ 5వ తేదీన జరిగిన విచారణలో.. ఐఎంజీ భూముల ఆక్రమ కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సిద్ధంగా ఉన్నప్పుడు అనధికారిక ప్రతివాదులు (బిల్లీరావు, మాజీ మంత్రి పి.రాములు)కు అభ్యంతరమెందుకని హైకోర్టులో పిటిషనర్లు ప్రశ్నించారు. భూముల కేటాయింపు అక్రమమని ఇదే హైకోర్టు తేల్చిందని, అయితే ఆ అక్రమాలకు, అవినీతికి పాల్పడిన వారెవరో నిగ్గు తేల్చాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు. సీబీఐ విచారణ చేపడితే నిందితులుగా మారబోయే వారికి విచారణ వద్దు అని వాదించే హక్కు లేదని తేల్చిచెప్పారు. 12 ఏళ్ల క్రితం దాఖలైన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాల్లో వాదనలు పూర్తి కావడంతో సీజే ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. తాజాగా తెలంగాణ హైకోర్టు ఈ పిటిషన్లను కొట్టివేసిట్లు రిజర్వు చేసిన తీర్పును వెల్లడించింది. 'హైదరాబాద్ పరిధిలో రూ.వేల కోట్ల విలువైన (ప్రస్తుత విలువ రూ.లక్ష కోట్లు) 850 ఎకరాల ప్రభుత్వ భూములను ఓ బోగస్ కంపెనీకి నాటి చంద్రబాబు ప్రభుత్వం కారుచౌకగా కేటాయించింది. ఆ కంపెనీకి రూ.వందల కోట్ల రాయితీలు ఇవ్వడమే కాకుండా హైదరాబాద్‌లోని క్రీడా స్టేడియంలు కూడా అప్పగించింది. దీని వెనుక చంద్రబాబు సర్కార్ పెద్దలు ఉన్నారు. బోగస్ కంపెనీకి ఇన్ని వందల ఎకరాలు, రూ.వందల కోట్లు ఎందుకు కేటాయించారు.. దీని వెనకున్న వారెవరో తేలాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలి..'అని కోరుతూ సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, న్యాయవాది శ్రీరంగారావు తదితరుల తరఫు న్యాయవాదులు రఘునాథ్‌రావు, గాడిపల్లి మల్లారెడ్డి 2012లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## కేంద్ర బృందానికి పిన్ టూ పిన్ వివరించిన
# అధికారులు, చంద్రబాబు ఆదేశాలతో !



ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టంపై అధ్యయనం చేయడానికి కేంద్ర బృందం రంగంలోకి దిగింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో జరిగిన వరద నష్టంపై అధికారుల ప్రాథమిక నివేదిక రూపొందించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఆంధ్రప్రదేశ్ లోని ఏడు జిల్లాలలో భారీగా నష్టం జరిగిందని సంబంధిత అధికారులు కేంద్ర బృందానికి నివేదిక సమర్పించారు. కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాలలో భారీ వర్షాలు, వరదల ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. వరదల దెబ్బకు అతలాకుతలం అయిన విజయవాడ నగరం పరిస్థితిని సంబంధిత అధికారులు కేంద్ర బృందానికి ప్రత్యేకంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన వరద సహాయక, పునరావాస చర్యలపై సంబంధిత అధికారులు కేంద్ర బృందానికి నివేదిక అందజేశారు. వరదలు, భారీ వర్షాల కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని అధికారులు కేంద్ర బృందానికి తెలిపారు. ఎన్ డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, వాయుసేన, ఆర్మీ హెలికాప్టర్ల సహాయం చేపట్టామని సంబంధిత అధికారులకు కేంద్ర బృందానికి వివరించారు. త్వరగతిన పారిశుద్ధ్య పనులు, సహాయక చర్యలు చేపట్టామని, హెలికాప్టర్ ద్వారా బాధిత ప్రజలకు ఆహారం, తాగునీరు, పాలు బిస్కెట్లు పంపిణీ చేశామని సంబంధిత అధికారులకు కేంద్ర బృందానికి వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల వీడియోలు, ఫోటోలను కేంద్ర బృందం ఎదుట అధికారులు ప్రదర్శించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లిందని సంబంధిత అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కేంద్ర బృందం సమావేశం అయ్యింది. శాఖల వారీగా అధికారులు భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టంపై కేంద్ర బృందానికి వివరించారు. అధికారుల నుండి పూర్తి సమాచారం తెలుసుకున్న కేంద్రం బృందానికి ఓ నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుందని సమాచారం.ః

## అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కీలక ప్రకటన




హైదరాబాద్: నగరంలో అన్యక్రాంతమైన ప్రభుత్వ భూములను, చెరువులను పరిరక్షించేందుకు రంగంలోకి దిగిన హైడ్రా.. ఆక్రమణదారుల నుంచి ఇప్పటి వరకు వంద ఎకరాలకుపైగా స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. జూన్ 27 నుంచి ఇప్పటివరకూ జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 23 ప్రాంతాల్లో 262 అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు హైడ్రా పేర్కొంది. తద్వారా 111.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రామ్‌నగర్ మణెమ్మ గల్లీలో 3, గగన్ పహాడ్ అప్పా చెరువులో 14, అమీన్‌పూర్ పెద్ద చెరువు పరిధిలో 24, మాదాపూర్ సున్నం చెరువులో 42, దుండిగల్ కత్వా చెరువు పరిధిలో 13 అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు హైడ్రా వెల్లడించింది. అత్యధికంగా అమీన్‌పూర్‌లో 51 ఎకరాలు, మాదాపూర్ సున్నం చెరువు పరిధిలో 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. హైడ్రాకు ఐపీఎస్ అధికారి రంగనాథ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. దీనికి ప్రత్యేక పోలీసు సిబ్బందిని కేటాయిస్తూ డీజీపీ కార్యాలయం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. 15 మంది సీఐ స్థాయి, 8 మంది ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులు ఆక్రమణల కూల్చివేత కోసం పనిచేయనున్నారు. దీంతో హైడ్రా చర్యలు వేగవంతం కానున్నాయి. కాగా చెరువుల పరిరక్షణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఐపీఎస్ అధికారి రంగనాథ్ హైడ్రా కమిషనర్‌గా ఉన్నారు. హైడ్రా గత రెండు నెలలుగా చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను ఎక్కడా ఉపేక్షించకుండా నేలమట్టం చేస్తోంది. పలు ప్రాంతాల్లో హైడ్రా కూల్చివేతలు చర్చనీయాంశంగా మారాయి. సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సహా పలు నిర్మాణాలను కూల్చివేసింది.

## లిక్కర్ కేసులో కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు.. ఎప్పటి వరకంటే..!



లిక్కర్ పాలసీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కస్టడీని ట్రయల్ కోర్టు పొడిగించింది. సెప్టెంబర్ 25 వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు నిర్ణయం తీసుకుంది. గతంలో విధించిన కస్టడీ బుధవారంతో ముగియడంతో మరోసారి కస్టడీ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. తీహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రౌస్ అవెన్యూ కోర్టులోని స్పెషల్ జడ్జి కావేరీ బవేజా ముందు హాజరు పరిచారు. ఇదే కేసులో మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించాయి. జైలు నుంచి విడుదలయ్యారు. లిక్కర్ పాలసీ కేసులో మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను తీహార్ జైలుకు తరలించారు. పలుమార్లు బెయిల్ పిటిషన్లు వేసినా తిరస్కరణకు గురయ్యాయి. లోక్‌సభ ఎన్నికల సమయంలో మాత్రం ప్రచారం కోసం సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తిరిగి జూన్ 2న తీహార్ జైల్లో లొంగిపోయారు. ఇదిలా ఉంటే వచ్చే నెలలో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. కేజ్రీవాల్ బెయిల్‌పై ఆప్ శ్రేణులు ఆశలు పెట్టుకున్నారు. సుప్రీంకోర్టు బెయిల్ ఇస్తుందేమోనని నమ్మకం పెట్టుకున్నారు. త్వరలోనే న్యాయస్థానం కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపనుంది.

# మణిపూర్‌లో చల్లారని మంటలు



ఇలా ఎంత కాలం? మా చదువులు సాగేదెలా? మా భవిష్యత్తు ఏమైపోవాలి? అంటూ మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో వేలాది విద్యార్థులు తాజాగా రోడ్లపైకి వచ్చి చేసిన ప్రదర్శన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతకానితనాన్ని, సమస్య పరిష్కారంలో వారి నాన్పుడు ధోరణిని కళ్లకు కడుతోంది. గత పదిహేను నెలలుగా మణిపూర్‌లో హింసాగ్ని రావణకాష్ఠంలా రగులుతూనే ఉంది. కుకీ, మైతేయి తెగల మధ్య చెలరేగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకూ మరణించినవారి సంఖ్య మూడు వందలకు పైమాటే. దాదాపు 70 వేల మంది ఇల్లూవాకిలీ వదిలి, శరణార్థి శిబిరాలలో మగ్గుతున్నారు. ఇక మిగిలిన జనమంతా ఎప్పుడేం జరుగుతుందో, ఏ క్షణంలో ప్రత్యర్థి తెగకు చెందినవారు దాడి చేసి ప్రాణాలు తీస్తారోననే భయంతో బిక్కుబిక్కుమంటూ గడపుతున్నారు. గత పది రోజులుగా హింసాకాండ తారస్థాయికి చేరింది. మయన్మార్ సరిహద్దులకు సమీపంలో ఉన్న జిరిబామ్ జిల్లాలో కుకీ సాయుధులు అత్యంత అధునాతన ఆయుధాలతో దాడులకు దిగుతున్నారు. గత పది రోజులుగా ఇరువర్గాలకు మధ్య జరుగుతున్న దాడులకు తొమ్మిది మంది బలయ్యారు. ప్రత్యర్థులపై తెగబడేందుకు దుండగులు డ్రోన్లు, రాకెట్లను వాడుతున్నారంటే అక్కడ శాంతిభద్రతల పరిస్థితి ఎంతలా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. కుకీలు దీర్ఘశ్రేణి రాకెట్లను సైతం వినియోగిస్తున్నారన్న వార్తలు విస్మయం కలిగిస్తున్నాయి. ఇంతటి ప్రమాదకరమైన ఆయుధాలు వారి చేతిలో పడినా, మణిపూర్‌లో మోహరించి ఉన్న సైన్యం, పోలీసులు ఏం చేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. పోలీసుల నుంచి దోచుకున్న ఐదు వేలకు పైగా ఆయుధాలను ఆందోళనకారులు బహిరంగంగా ప్రదర్శించడం, వీధుల్లో కవాతు చేయడం అక్కడ పరిపాటిగా మారింది. జనాభాలో అధిక శాతంగా ఉన్న మైతేయిలను ఎస్టీల జాబితాలో చేర్చే విషయాన్ని పరిశీలించాలంటూ హైకోర్టు గత ఏడాది మే నెలలో జారీ చేసిన ఉత్తర్వులతో మణిపూర్ భగ్గుమంది. 36 లక్షల మంది ప్రజలు నివసించే ఈ ఈశాన్య రాష్ట్రం యావత్తు రెండుగా విడిపోయింది. లోయ ప్రాంతాలపై మైతేయిలు, కొండ ప్రాంతాలపై కుకీలు ఆధిపత్యం చెలాయిస్తూ, ఒకరిపై ఒకరు దాడులకు దిగుతున్నారు. అయినప్పటికీ ఇంతవరకూ కంటితుడుపు చర్యలు మినహా సమస్య శాశ్వత పరిష్కారానికి పాలకులు చేపట్టిన చర్యలు శూన్యం. బిజెపి పాలిత మణిపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణ వ్యవహారాలను కేంద్ర హెూం శాఖ ఆధ్వర్యంలో యూనిఫైడ్ కమాండ్ పర్యవేక్షిస్తోంది. దీనివల్ల తన చేతులు కట్టేసినట్లు అవుతోందని భావిస్తున్న ముఖ్యమంత్రి, తాజాగా అల్లర్లు చెలరేగిన నేపథ్యంలో గవర్నర్‌ను కలసి యూనిఫైడ్ కమాండ్‌ను తనకు అప్పగించాలంటూ విన్నవించుకున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను నెలకొల్పడంలో విఫలమయ్యారనే కారణంగా బీరేన్ సింగ్‌పై బిజెపి అధిష్ఠానం ఇప్పటికే గుర్రుగా ఉంది. పార్టీ ఎంఎల్ఎలను వెంటబెట్టుకుని మరీ వెళ్లి గవర్నర్‌ను కలసి యూనిఫైడ్ కమాండ్‌పై అధికారాలు ఇవ్వాలని బీరేన్ కోరడంతో ఇక రాష్ట్రంలో నాయకత్వం మార్పు తప్పదన్న ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే అసలు సమస్యను వదిలిపెట్టి పార్టీలో అంతఃకలహాలపై బిజెపి అధిష్ఠానం దృష్టిసారిస్తోందన్న విమర్శలకు తాజా పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. ఏడాదిన్నరగా ఘర్షణలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి వహించడం ప్రతిపక్షాల చేతికి అస్త్రంగా మారింది. ఎక్కడ ఏ ఘర్షణ జరిగినా అక్కడకు వెళ్లి బాధితులకు సాంత్వన చేకూర్చే ప్రధాన మంత్రి ఇప్పటి వరకూ మణిపూర్‌ను సందర్శించకపోవడం విపక్షాలకే కాదు, సామాన్యుడి గుండెలను సైతం భగ్గుమనేలా చేస్తోంది. డబుల్ ఇంజన్ సర్కార్‌గా గొప్పలు చెప్పుకునే బిజెపి పెద్దలు, తమ ఏలుబడిలో ఉన్న రాష్ట్రంలో పరిస్థితులు ఇంత ఘోరంగా ఉంటే ఏడాదిన్నరగా ఏమీ చేయలేకపోవడం అసమర్థత గాక ఇంకేమిటన్న విమర్శకుల ప్రశ్నకు ఏం జవాబు చెబుతారు? కేంద్ర ప్రభుత్వం ఇకనైనా చిత్తశుద్ధితో రంగంలోకి దిగకపోతే మణిపూర్‌లో పరిస్థితి మరింత అల్లకల్లోలంగా మారుతుంది. రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పడంలో ఘోరంగా విఫలమైన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తప్పించాలన్న డిమాండ్‌ను కేంద్రంలోని పెద్దలు ఇకనైనా పరిగణనలోకి తీసుకోవాలి. ఘర్షణలకు ప్రధాన కారణంగా భావిస్తున్న మైతేయి, కుకీ తెగల పెద్దలను, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులను ఒక వేదికపైకి చేర్చి, చర్చలకు శ్రీకారం చుట్టడం ద్వారా సమస్య పరిష్కారానికి ప్రయత్నించడం శ్రేయస్కరం.

# అడవుల పరిరక్షణకు మనం సైతం




అడవులు భూమాతకు ఊపిరితిత్తులుగా అమూల్య సేవలందిస్తూనే, గాలిని శుద్ధి చేస్తూ, జీవులన్నించికీ ప్రాణ వాయువును అందిస్తూ, వాతావరణ సానుకూల మార్పులకు జీవం పోస్తూ, జీవ కోటి మనుగడకు అమూల్య పునాదులు వేస్తున్నాయి. 10-20 ఏళ్ల క్రితం నువ్వు నాటిన చెట్టును చూస్తూ గర్వించడం నేర్చుకొని ప్రతి ఏటా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు భుజాన వేసుకోవడం మన జీవనశైలిలో భాగం కావాలి. కనీస బాధ్యతగా తీసుకోవాలి. పర్యావరణం విచ్ఛిన్నమైతే జీవకోటి సర్వనాశనం అవుతుందని గుర్తుంచుకోవాలి. భూమాత తనపై రాసుకున్న కవిత శీర్షిక 'అటవీ మాత' అని అర్థం చేసుకోవాలి. రేపటి ఆశావహ జీవనానికి నేడు ఓ మొక్కను నాటే అలవాటు చేసుకోవాలి. ఏ జాతి తన నేల మట్టిని నిర్లక్ష్యం చేస్తుందో ఆ పౌర సమాజం మట్టిలో కలవడం ఖాయమని తెలుసుకోవాలి.

### 1730 ఖేజర్లీ ఊచకోత

రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో 1730 సెప్టెంబర్ 11న నాటి మహారాజు ఆదేశాలతో అడవిలోని ఖేజ్రీ చెట్లను నరకడాన్ని ఖేజర్లీ గ్రామస్థులు శాంతియుతంగా వ్యతిరేకించారు. వారిపై విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల్లో 363 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ "ఖేజర్లీ ఊచకోత"కు నిరసనగా సెప్టెంబర్ 11న దేశవ్యాప్తంగా "జాతీయ అటవీ అమరవీరుల దినం" పాటిస్తున్నాం. ఈ ఊచకోత దుర్ఘటన తర్వాత ఇరవయ్యవ శతాబ్దంలో సుందర్ లాల్ బహుగుణ నేతృత్వంలో 'చిప్కో ఉద్యమం' ప్రారంభమైంది. అడవుల్లో కలప, గంధం చెక్కలు, వన్య ప్రాణుల వేట, అటవీ భూముల దురాక్రమణ లాంటి సందర్భాల్లో విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బందితో పాటు వ్యతిరేకించే పర్యావరణ ప్రేమికుల పట్ల స్మగ్లర్లు/వేటగాళ్లు కాల్పులు, దాడులు చేసి గాయపరచడం, ప్రాణాలు సహితం తీయడం అనాదిగా, అమానవీయంగా కొనసాగుతున్నది. జాతీయ అటవీ అమరవీరుల దినం వేదికగా ప్రతి ఏటా మొక్కలు నాటడం, నాటిన మొక్కలు/చెట్లను పరిరక్షించుకోవడం, విద్యాలయాల్లో హరిత హిత సదస్సులు/ కార్యశాలలు/వన్యప్రాణుల సంరక్షణ సమావేశాలు ఏర్పాటు చేయడం, అటవీ పరిరక్షణలో ప్రాణ త్యాగం చేసిన కుటుంబాలకు చేయూత ఇవ్వడం, అటవీ అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అడవులను శుద్ధి చేయడం, పర్యావరణ సంస్థలకు చేయూత ఇవ్వడం, అటవీ రక్షణలో సుస్థిరాభివృద్ధి కార్యాచరణ అమలు చేయడం, అటవీ సంరక్షణ కేంద్రంగా డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిలిమ్ వీడియోల ద్వారా ప్రచారం చేయడం, అటవీ సంరక్షకుల కథనాలు చదివి ప్రేరణ పొందడం, సమీప అడవులకు వెళ్లి వన్య ప్రాణులు, వృక్షజాతుల అందాలు ఆస్వాదించడం లాంటి పలు కార్యక్రమాలు చేపట్టాలి. ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్‌లో అటవీ సంపద సంరక్షణలో అటవీ ఉద్యోగుల మరణాలు అధికంగా నమోదు అవుతున్నాయి. 2012-17 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా 536 మంది మరణించగా అందులో 162 మంది భారతీయ ఫారెస్ట్ రేంజర్లు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. ఇదే తరహాలో కాంగో (51 మంది), థారులాండ్(37), కెన్యా(32), యూఎస్ఏ (25), సౌత్ ఆఫ్రికా(18 మంది) దేశాల్లో కూడా అధికంగా అటవీ శాఖ ఉద్యోగులు అధికంగా ప్రాణాలు కోల్పోతున్నారని గణాంకాలు వివరిస్తున్నాయి. ఆరోగ్యకర పౌర సమాజానికి పరిశుద్ధ ప్రాణ వాయువు అవసరమని, ప్రాణ వాయువును అడగకుండానే ఉచితంగా బహూకరిస్తున్న హరిత అడవుల పట్ల సంపూర్ణ గౌరవాన్ని కలిగి ఉన్న సమాజమే భవిష్యత్తులో మనుగడ సాధించగలదని గమనించాలి. అడవులు మన శ్రేయోభిలాషులని, సకల జీవరాసుల మేలు కలయికతో జీవవైవిధ్యం నెలకొనడానికి హరిత వనాలు ఉపకరిస్తున్నాయని తెలుసుకుందాం. మన ఉజ్వల భవితను మనమే లిఖించుకుందాం.

# హేమ కమిటీ నివేదిక మహిళల పోరాటంలో ఓ మైలురాయి



కేరళ సినీ పరిశ్రమను పూర్తిగా కుదిపివేసిన హేమ కమిటీ నివేదిక యావత్ దేశానికి ఆదర్శంగా నిలిచింది. కోల్‌కతా, తమిళనాడు వంటి వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది కళాకారులు హేమ కమిటీ వంటి కమిటీలను ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ఏర్పాటు చేయలేదనే ప్రశ్నలను లేవనెత్తారు. ఇది న్యాయమైన ప్రశ్న. మహిళలపై ఈ తరహా దోపిడీ బాలీవుడ్ మొదలుకొని సినీ పరిశ్రమ అంతటిలో వుందనేది బహిరంగ రహస్యం. కానీ ఈ రంగాన్ని శాసించే శక్తులు మహిళల గొంతు నొక్కేస్తున్నాయి. సినిమా పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు 'ఉమెన్ సినిమా కలెక్టివ్' (డబ్ల్యుసిసి)ని ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం కేరళ. తమ సహోద్యోగుల్లో ఒకరికి ప్రముఖ నటుడి చేతిలో చేదు అనుభవం ఎదురైన నేపథ్యంలో ఈ సంస్థ ఏర్పడింది. పినరయి విజయన్ నేతృత్వంలోని వామపక్ష ప్రజాస్వామ్య ప్రభుత్వం కూడా సంస్థకు గొప్ప మద్దతునిచ్చింది. తమ ప్రాంతంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను డబ్ల్యు.సి.సి సభ్యులు లేవనెత్తడంతో వామపక్ష ప్రభుత్వం ఆ సమస్యను అధ్యయనం చేసి పరిష్కరించేందుకు జస్టిస్ హేమ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. పితృస్వామ్యంతో పాతుకుపోయిన ఏ సమాజంలోనైనా ప్రగతిశీల మార్పునకు నాంది పలికేది మహిళలే. భారత దేశంలో మహిళా సంఘాలు, ఉద్యమాల చరిత్ర కూడా ఇదే. మహిళల పట్ల సానుభూతి చూపే, వారి సమస్యలను వినే ప్రభుత్వం డబ్ల్యు.సి.సి వంటి ఉద్యమానికి ఎంతగానో తోడ్పడింది. మహిళా ఉద్యమం, రాజకీయ శక్తులు చేతులు కలిపితే పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా గట్టి అడుగు పడుతుంది. సామాజిక మార్పు కోసం మహిళలు చేస్తున్న పోరాటాల్లో వామపక్షాలు శక్తివంతమైన మిత్రపక్షంగా ఉన్నాయి. కేరళలో వామపక్ష ప్రభుత్వం ఉంది. మహిళలపై దోపిడీని నిరోధించడానికి, అవసరమైన అన్ని రకాల రక్షణలకు అది కట్టుబడి ఉంది. హేమ కమిటీ ఏర్పాటు, ఆ తర్వాత ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నియామకం అందుకు అద్దం పడుతోంది. సినీ పరిశ్రమను శాసించే శక్తులపైన, లైంగిక దోపిడీ, లాబీలకు సంబంధించిన అంశాలపైన హేమ కమిటీ నివేదిక దృష్టి సారించింది. మహిళా కళాకారులు అత్యంత అరక్షిత పని పరిస్థితులలో, విశ్రాంతి గదులు కూడా లేకుండా, ఎటువంటి ఒప్పందాలు లేకుండా పని చేయాల్సి ఉంటుంది. హేమ కమిటీ నివేదిక ప్రకారం, పరిశ్రమలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అనేక సంఘాలు సినీ రంగంలో ఉన్నాయి. అయితే వాటిలో చాలా వరకు నమోదు కాలేదు. అనేక సంఘాలు ఎవరి కోసం నిలబడాలో వారినే దోపిడీ చేస్తున్నాయని తేలింది. అటువంటి సంస్థలన్నిటినీ రిజిస్టర్ చేసి, వాటి కార్యకలాపాలన్నిటినీ చలన చిత్ర పరిశ్రమ నియమ నిబంధనల పరిధిలోకి తీసుకు రావాలని హేమ కమిటీ సిఫారసు చేసింది. ఫిల్మ్ అసోసియేషన్ 'అమ్మ' సంస్థ సభ్యులను ఎంపిక చేయడంలో కూడా వివక్ష చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. హేమ కమిటీ నివేదిక వెలువడ్డాక ఆ సంస్థ పని తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం కావడంతో సంస్థకు చెందిన మొత్తం ఆఫీస్ బేరర్లు రాజీనామా చేయాల్సి వచ్చింది. సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు ఫిర్యాదు చేసేందుకు 'సిట్'ను ఏర్పాటు చేసి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం ఆదర్శప్రాయమైన చర్య తీసుకుంది. వేధింపులు జరిగి ఎంత కాలమైనా ఫిర్యాదు చేయడానికి ఎలాంటి పరిమితి లేదు. బెంగాల్ కళాకారులు సహా అనేకమంది 'సిట్'కు ఫిర్యాదులు చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడారు. మహిళకు తాను ఎదుర్కొన్న వేధింపుల గురించి మాట్లాడాలంటే ధైర్యం కావాలి. అయితే, మహిళలు ఫిర్యాదులు చేయనారంభించినప్పుడు, నిందితులు కూడా వాటిపై తిరుగు ఫిర్యాదులు చేశారు. ఇది పితృస్వామ్య సమాజంలోని సమస్య. తమను తాము సమర్థించుకోవడానికి చాలా మంది నుండి ఇలాంటి స్పందనలు రావడం సహజం. న్యాయం కోసం పోరాడుతున్న వారి పక్షాన వున్నామని ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. కాబట్టి మహిళా ఫిర్యాదుదారులకు రక్షణ కల్పించేందుకు, రౌడీలపై చర్యలు తీసుకునేందుకు 'సిట్' అవసరమైన చర్యలు తీసుకుంటుందనడంలో సందేహం లేదు. మహిళలు మాట్లాడితే తప్ప సమాజం మారదు. కాబట్టి దాడి చేసిన వారి పేర్లను బహిర్గతం చేయడమనేది బాధితుల రక్షణకు ఉపయోగపడుతుంది. హేమ కమిటీ నివేదిక ప్రచురణకు సంబంధించిన అన్ని సమస్యలను అధిగమించడానికి ఎల్.డి.ఎఫ ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేసింది. అంతేగాక అవసరమైన చట్టపరమైన చర్యలను తీసుకుంది. అయితే కేరళలోని కాంగ్రెస్ పార్టీకి దీనికి సబంధించి ఒకే ఒక ఎజెండా ఉంది. అదేమంటే ప్రభుత్వ ప్రయత్నాలను ఏదోక విధంగా అడ్డుకోవడమే. సినీ పరిశ్రమలో మహిళల న్యాయ పోరాటానికి ఎల్.డి.ఎఫ్ ప్రభుత్వం మద్దతుగా నిలిచినప్పుడు, అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రక్షించే పార్టీగా కాంగ్రెస్ మారింది. మీడియాలోని కమ్యూనిస్టులకు వ్యతిరేకమైన ఓ వర్గం వారికి మద్దతు ఇస్తున్న పరిస్థితి నెలకొంది. దర్యాప్తు బృందానికి అందిన ఫిర్యాదు ఆధారంగా సిపిఎం ఎమ్మెల్యే ముఖేష్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం నిందితులను కాపాడుతోందన్న కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలను తోసిపుచ్చింది. ఇలాంటి విషయాల్లో 'వారు చేశారు కాబట్టి మేం చేశాం' అనే ధోరణి ఉండకూడదు. ప్రతి చోటా మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడంపై దృష్టి సారించాలి. హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో- సినీ పరిశ్రమలో జరుగుతున్న అన్యాయాలపై ధైర్యంగా పోరాడేందుకు ప్రభుత్వం, సమాజం తమకు తోడుగా నిలుస్తున్నాయని మహిళలు విశ్వసించాలి. కేరళకు ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. న్యాయ పోరాటంలో హేమ కమిటీ నివేదిక మరో మైలు రాయి వంటిది. ఇందుకు అండగా నిలిచిన మహిళలకు అభినందనలు. మహిళలు చెప్పింది వింటూ వారికి మరింత బలాన్ని ఇచ్చినందుకు కేరళ వామపక్ష ప్రభుత్వానికి ధన్యవాదాలు.

## దేశ ప్రజలను అవమానించేలా అమెరికాలో రాహుల్ వ్యాఖ్యలు



హైదరాబాద్, : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల హ్యాంగోవర్ నుంచి బయటపడ్డట్టు లేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ అమెరికా పర్యటనలో దేశం, ప్రజాస్వామ్యం పట్ల భారత దేశ ప్రజలను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మోదీ, బీజేపీ వల్ల ప్రధాని కాలేదనే అక్కసుతో దేశం మీద విషం చిమ్ముతున్నారన్నారు. కాంగ్రెస్ ఓడిపోయినంత మాత్రాన ప్రజాస్వామ్యం లేదని ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని ఫేక్ వీడియోలు సృష్టించి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ లబ్ధి పొందిందన్నారు. రిజర్వేషన్ల రద్దుకు రాహుల్ గాంధీ తెరలేపుతున్నారన్నారు. రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు కల్పించిన అంబేద్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ ది అని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు హోదాలో సమయం అనుకూలించినప్పుడు రద్దు చేస్తామని రాహుల్ గాంధీ చెప్పారన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వం నచ్చే బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. భారతదేశాన్ని వ్యతిరేకించే శక్తులతో రాహుల్ గాంధీ సమావేశం అవుతున్నారన్నారు. రాహుల్ గాంధీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిక్కుల ఊచకోతకు కారణమైంది కాంగ్రెస్ పార్టీ అని.. సిక్కుల హక్కుల కోసం రాహుల్ గాంధీ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ లక్ష్మణ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా విరుచుకుపడ్డారు. రాహుల్.... క్విట్ ఇండియా అంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాలకు వెళ్లి భారత ఎన్నికల వ్యవస్థను విమర్శిస్తావా? అంటూ మండిపడ్డారు. రిజర్వేషన్లపై నోటికొచ్చినట్లు మాట్లాడతావా అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కమలా హారిస్ క్లియర్ విన్నర్ కాదా?.. నెట్టింట కొత్త చర్చ



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతోన్న రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ మధ్య తొలి డిబేట్ వాడీవేడిగా సాగింది. అయితే, ఈ డిబేట్‌లో ఆద్యాంతం కమలదేపై చేయి నడిచిందంటూ అమెరికా మీడియా చెబుతుండగా.. సోషల్ మీడియాలో మాత్రం ఓ కొత్త చర్చ మొదలైంది. కమలా హారిస్ ఛీటింగ్ చేశారంటూ కొందరు నెటిజన్లు చర్చ మొదలుపెట్టారు. దానికి ట్రంప్ మద్దతుదారులు జత కలవడంతో అది తారాస్థాయికి చేరింది. ఇంతకీ ఈ చర్చకు కారణం..డిబేట్ టైంలో ఆమె ధరించిన చెవిపోగులే. పెన్సిల్వేనియాలోని నేషనల్ కాన్‌స్టిట్యూషన్ సెంటర్ వేదికగా ట్రంప్-కమల మధ్య సంవాదం 90 నిమిషాల పాటు కొనసాగింది. ఇద్దరూ పలు అంశాలపై పరస్పర విమర్శలు గుప్పించుకున్నారు. డొనాల్డ్ ట్రంప్ సైతం ఈ డిబేట్‌ను అత్యుత్తమ చర్చల్లో ఒకటిగా భావిస్తున్నానని చెప్పారు. అయితే కమలకే ఎక్కువ ఓట్లు పడ్డప్పటికీ.. ఇప్పుడు ఓ విమర్శ ఆమెను చుట్టుముట్టింది. ఈ చర్చలో కమలా హారిస్ ధరించిన చెవిపోగులు సీక్రెట్ పరికరమని, వాటి సాయంతోనే ఆమె డిబేట్‌లో అంత అద్భుతంగా మాట్లాడగలిగారంటూ కొందరు వాదిస్తున్నారు. ఈమేరకు కొన్ని వెబ్‌సైట్ ఫొటోలను, రివ్యూలను చూపిస్తున్నారు. "డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సంవాదంలో కమలా హారిస్ అద్భుతంగా మాట్లాడారు. ఇయర్‌రింగ్ మాదిరిగా ఉండే ఇయర్‌ఫోన్‌కు సంబంధించిన కథనం గుర్తుకు వచ్చింది" అని ఓ నెటిజన్, ఒబామా మాదిరిగానే కమలా బాగా మాట్లాడారన్న మరో యూజర్.. ఆమె ధరించిన చెవిపోగులు నోవా హెచ్1 ఆడియో ఇయర్‌రింగ్స్ మాదిరిగానే ఉన్నాయన్నారు. అయితే ఆమె మద్దతుదారులు మాత్రం ఆ వాదనను ఖండించారు. ఆమె రెగ్యులర్‌గా ధరించే ఇయర్‌రింగ్స్ అవని, వాటి విషయంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నారంటూ ఆరోపణల్ని కొట్టిపారేస్తున్నారు. ఇక.. ఫస్ట్ ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో విన్నర్‌గా ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ గెలిచారు. ఈ విషయాన్ని అక్కడి మీడియా చానెల్స్ అధికారికంగా ప్రకటించాయి. డిబేట్‌లో ట్రంప్, హారిస్ దరిదాపుల్లోకి కూడా రాలేకపోయారంటూ విశ్లేషణాత్మక కథనాలు ఇచ్చాయి. డిబేట్‌లో ఇద్దరి మధ్య విమర్శ-ప్రతివిమర్శల్లో.. హారిస్‌దే పైచేయిగా సాగిందని, ట్రంప్ ఘోరంగా తడబడ్డారంటూ యూఎస్ మీడియా పేర్కొంది. అలాగే.. స్వింగ్ స్టేట్స్‌లోనూ కమలకు మంచి మార్కులు పడ్డాయని తెలిపాయి. మొత్తంగా హారిస్ ఈ డిబేట్‌లో క్లియర్ విన్నర్ అని తేల్చేశాయి.

## ఉప ఎన్నికలు వస్తాయని ఆ ఎమ్మెల్యేలు భయపడుతున్నారు..



హైదరాబాద్: తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10మంది ఎమ్మెల్యేలు వణికిపోతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. పూటకో పార్టీ మారే దానం నాగేందర్ బిచ్చగాడు, చీటర్ అంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలంటూ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద ఇవాళ(బుధవారం) అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులను కలిశారు. హైకోర్టు నాలుగు వారాల సమయం ఇచ్చిందని, చర్యలు తీసుకోకుంటే సుమోటోగా కేసు స్వీకరిస్తామని హైకోర్టు చెప్పిన విషయాన్ని నరసింహాచార్యులకు వివరించారు. కాలయాపన చేయకుండా తక్షణమే వారిపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై పాడి కౌశిక్ రెడ్డి నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.." పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఏ మాత్రం సిగ్గు లేదు. వారు వెంటనే రాజీనామా చేయాలి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనేక పార్టీలు మారారు. ఇకపై ఆయన శాశ్వతంగా మాజీ ఎమ్మెల్యేగా మిగిలిపోతారు. కడియం శ్రీహరి పచ్చి మోసగాడు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద పొద్దున బ్యాగులు తీసుకుని సాయంత్రాని కల్లా కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి డిపాజిట్ తెచ్చుకుని చూపించాలి. కాంగ్రెస్‌లో చేరానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్వయంగా మీడియాకు చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్నారు. అరికెపూడి గాంధీ మా పార్టీ సభ్యుడైతే తెలంగాణ భవన్‌కు రావాలి. స్పీకర్ నిర్ణయం దాకా ఆగకుండా ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఉపఎన్నికలను రావాలి. గతంలో కేసీఆర్ విడిగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నారని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఎల్పీలో సీఎల్పీ విలీనం అయ్యింది" అని అన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేసే విధంగా మంత్రి శ్రీధర్ బాబు మాటలు ఉన్నాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాలంటే ఎమ్మెల్యేలపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు తన గౌరవాన్ని తగ్గించుకునే విధంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. దానం, కడియం, అరికెపూడి మినహా మిగతా ఏడుగురు ఎమ్మెల్యేలపై పిటీషన్ స్పీకర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని చెప్పారు. సుప్రీంకోర్టు బెంచ్ ఎమ్మెల్యేల అనర్హతపై కాలయాపన వద్దని గతంలో తీర్పు ఇచ్చిందని.. హై కోర్టు తీర్పును శ్రీధర్ బాబు వక్రీకరిస్తున్నారని విమర్శించారు. పార్టీ మారితే వెంటనే అనర్హత వేటు వేయాలని దేశం మొత్తం రాహుల్ గాంధీ చెప్తున్న విషయాన్ని కేపీ వివేకానంద గుర్తు చేశారు.

## ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్ ఛైర్మన్‌గా రామ్మోహన్ నాయుడు




న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 2వ ఆసియా-పసిఫిక్ మినిస్టీరియల్ కాన్ఫరెన్స్‌లో సభ్య దేశాల ఛైర్మన్ ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఇందులో ఏపీఎంసీ ఛైర్మన్‌గా కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును సింగపూర్ దేశం ప్రతిపాదించగా భూటాన్ దేశం మద్దతుతో ఆయా దేశాల ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంటే 40 సభ్య దేశాల ప్రతినిధులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశం తరపున దక్కిన ఈ గౌరవాన్ని బాధ్యతగా స్వీకరిస్తానని తెలిపారు. విమానయాన రంగాన్ని ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకు రావడంతో పాటు సభ్య దేశాల మధ్య రవాణాను సులభతరం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. ఆకాశ మార్గాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు సభ్య దేశాలన్నీ ఉమ్మడిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

# వరద బాధిత ప్రజలను ఆదుకోండి

### ముఖ్యమంత్రికి సిపిఎం మెమొరాండం



కృష్ణా నదికి, బుడమేరు వాగుకు వరదల మూలంగా ప్రధానంగా విజయవాడ నగరం, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అపార నష్టం సంభవించింది. గడిచిన వారం రోజులుగా ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆ తరువాత గోదావరి నది, కొల్లేరు ప్రాంతం, అదే విధంగా ఇప్పుడు అల్లూరి సీతారామరాజు జిల్లా, ఉత్తరాంధ్ర భారీ వర్షాలు, ముంపు ముప్పులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాధిత ప్రజలను ఆదుకునేందుకు తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాము. (1) కేంద్ర ప్రభుత్వం ఈ వరదను జాతీయ విపత్తుగా ప్రకటించాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలి. (2) కేంద్రం తక్షణ సాయంగా పది వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలి, నివేదికల అనంతరం పూర్తి సహాయం ఇవ్వాలి, అన్ని విధాల రాష్ట్రాన్ని ఆదుకోవాలి. (3) రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి. (4) వరదల్లోను, వర్షాలకు కొండ చరియలు విరిగిపడి మతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి. వరద ముంపునకు గురైన ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.25 వేలు ఇవ్వాలి. అంచనాలు అనంతరం పూర్తి సహాయం లక్షకు తగ్గకుండా ఇవ్వాలి. (5) దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు ఆర్థిక సహాయం రూ.2 లక్షలు అందించాలి, పూర్తిగా దెబ్బతిన్న వాటికి రూ.5 లక్షలు ఇచ్చి పునర్నిర్మించాలి. (6) ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకులు, పాత్రలు, బట్టలు, మంచాలు ఇవ్వాలి. (7) ఆగస్టు, సెప్టెంబర్ నెల విద్యుత్ బిల్లులు రద్దు చేయాలి. (8) 2024-25 ఇంటి పన్నులు, మంచి నీరు, డ్రైనేజీ ఇతర యూజర్ చార్జీలను రద్దు చేయాలి. (9) ప్రభుత్వ బ్యాంకులు, ప్రైవేటు ఆర్థిక సంస్థలు రెండు నెలల ఈఎంఐలు రద్దు చేయాలి, మిగిలిన ఈఎంఐలను సంవత్సరం పాటు వాయిదా వేయాలి. (10) ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలకు, ఇతర వాహనాలకు జరిగిన నష్టానికి అవసరమైతే నిబంధనలు సడలించి ఇన్సూరెన్స్ కంపెనీలు పూర్తి పరిహారమివ్వాలి. ఇన్సూరెన్స్ లేని వాహనాల పునరుద్ధరణకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలి. (11) చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమలు, సంస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి అన్ని విధాల ఆదుకోవాలి. రుణాలు చెల్లింపు వాయిదా వేసి, సబ్సిడీతో కొత్త రుణాలు ఇవ్వాలి, ఇన్సూరెన్స్ కంపెనీలు నిబంధనలు సడలించి పూర్తి పరిహారం ఇవ్వాలి. (12) బ్యాంకులు లక్ష రూపాయలకు తగ్గకుండా వడ్డీ లేని వినిమయ రుణాలు ఇవ్వాలి. (13) విద్యార్థుల సర్టిఫికెట్లు, పట్టాలు, ప్రజల గుర్తింపు కార్డులు కోల్పోయిన వారికి ప్రభుత్వ బాధ్యతగా ఆయా డిపార్టుమెంట్ల నుండి తక్షణం ఇప్పించాలి. (14) నిండిపోయిన మరుగుదొడ్లను శుభ్రం చేయించాలి. మహిళలకు శానిటరీ నాప్‌కిన్స్ ఇవ్వాలి. ఇతర అవసరాలు తీర్చాలి. (15) వరద ప్రాంతాల్లో బ్యాంకులు పంట రుణాలు రద్దు చేయాలి. కొత్తగా రుణమివ్వాలి. ప్రయివేటు అప్పుల చెల్లింపు సంవత్సరం పాటు వాయిదా వేయించాలి. వడ్డీ మాఫీ చేయించాలి. పంటల బీమా చెల్లించాలి. (16) నష్టపోయిన పంటలకు వ్యవసాయ ఖర్చులు లెక్కించి ఆయా పంటల వారీగా నష్టపరిహారం ఇవ్వాలి. ప్రత్యామ్నాయ పంటలకు సబ్సిడీతో విత్తనాలివ్వాలి. డ్వాక్రా, పొదుపు సంఘాలు, రైతులు, చిరు వ్యాపారులు, వృత్తిదారుల రుణాలు మాఫీ చేయాలి. (17) పంట నష్టపోయిన కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా గుర్తించి పంట నష్టపరిహారం, బ్యాంకులు పంట రుణాలు, రబీ పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి. (18) వ్యవసాయ కార్మికులకు తక్షణమే ఉపాధిహామీ పనులు చేపట్టాలి. ముంపుకు గురైన పేదలందరికీ కుటుంబానికి రూ.10 వేలు నగదు, మూడు నెలలపాటు ఆహార ధాన్యాలు ఉచితంగా ఇవ్వాలి. (19) గొర్రెలు, మేకలు, పశువులకు ఇన్సూరెన్సు, క్లెయిమ్స్ త్వరగా పరిష్కరించాలి. పశు దాణా ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలి. (20) చేతి మగ్గాలు, ఇతర వృత్తిదారులకు జరిగిన నష్టాన్ని ఎన్యూమరేట్ చేసి తగు పరిహారమివ్వాలి. (21) బుడమేరు శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలి. బుడమేరు ప్రవాహానికి అడ్డంకులను తొలగించాలి. (22) కష్ణానది కరకట్ట వాల్‌ను బలోపేతం చేయాలి. రిటైనింగ్ వాల్ నుండి డ్రైనేజీ నీటి కొరకు ఉన్న ఖాళీల నుండి వరద నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. (23) దెబ్బతిన్న గ్యాస్ స్టవ్‌ల స్థానే కొత్తవి ఇవ్వాలి. సిలిండర్లు పోయిన వారికి కొత్త సిలిండర్లు ఇవ్వాలి, ఒక సిలిండర్ నింపి ఉచితంగా ఇవ్వాలి. (24) ప్రతి ఇంటిలోని వ్యర్థాలు తొలగించటానికి తగు ఏర్పాట్లు చేయాలి. (25) రాకపోకలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలి. (26) సాధారణ పరిస్థితి ఏర్పడే వరకు ప్రాంతాలవారీగా భోజన కేంద్రాలు ఏర్పాటు చేయాలి. (27) టీవీలు, ఫ్రిజ్‌లు, నీటి మోటార్లు, వాషింగ్ మిషన్లు, వాహనాలు రిపేర్లు ఉచితంగా చేయడానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. (28) పెండింగ్‌లో ఉన్న పెన్షన్ తక్షణమే పంపిణీ చేయాలి. (29) ప్రతి ఇంటిలో దెబ్బతిన్న వైరింగ్ తొలగించి కొత్త వైరింగ్‌తో విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలి. (30) ప్రతి ఇంటికి మంచినీటి మోటర్ ఉచితంగా ఇవ్వాలి. కుటుంబానికి రోజూ 20 లీటర్లు మంచినీరు సప్లై చేయాలి. (31) ముంపునకు గురైన ప్రభుత్వ, వివిధ సంస్థల ఉద్యోగులకు 15 రోజులు పాటు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలి. (32) రోడ్లు, డ్రైన్లు మరమ్మతులు తక్షణం చేపట్టాలి. (33) దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి, వీధి లైట్లు అన్నీ పునరుద్ధరించాలి. (34) వ్యాధులు ప్రబలకుండా, వైద్య సౌకర్యాల కోసం ప్రతి వార్డుకు, గ్రామానికి ఒక ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి. (35) వరద పీడిత ప్రాంతాలలో అన్ని రకాల వైద్యులతో ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేయాలి, పిహెచ్‌సిలు ఉన్న ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు కల్పించాలి, అంబులెన్సులు, జనరేటర్లు ఏర్పాటు చేయాలి. (36) కొండ ప్రాంతాల్లో నివాస ప్రాంతాల అభివృద్ధికి, రక్షణకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి, ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి. (37) స్కూలు, కాలేజీ విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, ఇతర సామగ్రి ఉచితంగా ఇవ్వాలి. (38) అన్ని ప్రైవేటు స్కూలు, కాలేజీలకు ఫీజులు రద్దు చేయాలి. పేద, మధ్యతరగతి వారి పిల్లలకు ప్రభుత్వమే ఆ ఫీజులు చెల్లించాలి. (39) ముంపు బాధితులైన మునిసిపల్, స్కీమ్ వర్కర్లు విధులకు హాజరు కావాలని అధికార్లు ఒత్తిడి చేస్తున్నారు. వారికి మినహాయింపునిచ్చి 15 రోజులపాటు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి.

# నయా చరితకు నాంది!



కృషితో నాస్తి దుర్భిక్షమ్ అన్న నానుడిని పారిస్ పారాలింపిక్స్‌లో మన క్రీడాకారులు నిరూపించారు. వైకల్యాన్ని అధిగమించి, పరిహాసాలను పారదోలి పట్టుదలతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన భారత క్రీడాకారులకు జేజేలు. ఇదివరకెన్నడూ లేనివిధంగా మూడు పదులకు చేరువగా పతకాలను సాధించి కొత్త చరిత్ర సృష్టించారు. దీనికి ముందు ఇదే వేదికపై జరిగిన సమ్మర్ ఒలింపిక్స్‌లో ఆశించిన రీతిలో రాణించలేకపోయామే అన్న బాధ నుంచి ఇది కొంత ఊరటనిచ్చింది. ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, 13 కాంస్యాలతో మొత్తం 29 పతకాలతో పతకాల పట్టికలో భారత్ 18వ స్థానంలో నిలవడం గొప్ప విషయమే. ఇప్పటివరకు జరిగిన పారాలింపిక్ క్రీడల్లో భారత్ మొత్తంగా 60 పతకాలు సాధిస్తే.. ఈ ఒక్క పారాలింపిక్స్‌లోనే సగానికి పైగా పతకాలు రావడం విశేషం. దాదాపు రెండు వారాల పాటు జరిగిన ఈ పోటీల్లో 549 పతక ఈవెంట్లలో ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన 4,400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 84 మందితో కూడిన భారత క్రీడా బృందం 12 క్రీడాంశాల్లో పాల్గొని పతకాల పంట పండించింది. ఓవరాల్‌గా చూసినప్పుడు చైనా తన తిరుగులేని ఆధిక్యతను ఈసారి కూడా కొనసాగించింది. టోక్యో పారాలింపిక్స్‌లో మాదిరిగానే 94 స్వర్ణాలు సహా 220 పతకాలు సాధించి నెంబర్ వన్ స్థానంలో అది నిలవగా, 49 స్వర్ణాలు సహా 124 పతకాలతో బ్రిటన్ ద్వితీయ స్థానంలోను, 105 పతకాలతో అమెరికా తృతీయ స్థానంలోనూ నిలిచాయి. 1972లో తొలి భారత పారాలింపిక్ విజేతగా మురళీకాంత్ పేట్కర్, తొలి మహిళా పారాలింపియన్‌గా 1984లో మాలతీ కృష్ణమూర్తి హొల్లా నిలిచారు. ఆ తరువాత మరో ముగ్గురు మహిళలు మాత్రమే అటువంటి గౌరవాన్ని పొందారు. ప్రస్తుత పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా 10 మంది మహిళలు పతకాలు సాధించి శెభాష్ అనిపించుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్‌లో స్వర్ణంతో ఇప్పటికి రెండు పారాలింపిక్ స్వర్ణాలు గెలిచిన అవని మినహా మిగిలిన తొమ్మిదిమంది తొలిసారి విజయ దుందుభి మోగించిన వారే. రెండు చేతులు లేకున్నా, కాలితోనే బాణం సంధించే జమ్ము కాశ్మీర్‌కు చెందిన 17 ఏళ్ల శీతల్‌దేవి రాకేశ్‌కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్యం సాధించడంతోపాటు, చిన్న వయసులో పారాలింపిక్స్‌లో పతకం దక్కించుకున్న భారత ఆర్చర్‌గా అరుదైన రికార్డును నెలకొల్పింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన తెలుగమ్మాయి దీప్తి జివాంజి 400 మీటర్ల పరుగులో కాంస్యం సాధించి, మానసిక వైకల్యం తన లక్ష్యాన్ని ఆపలేదని నిరూపించింది. తల్లిదండ్రుల త్యాగాన్ని గుర్తుంచుకుని తన కోసం అమ్మేసిన స్థలాన్ని కొని వారికి కానుకగా ఇచ్చింది. అవమానాలను అధిగమించి 100, 200 మీటర్లలో రాణి ప్రీతిపాల్ రెండు కాంస్యాలు సాధించింది. ఇప్పటికే పేరున్న జావలిన్ త్రోయర్ సుమిత్ ఆంటిల్, హై జంపర్ మారియప్పన్ తంగవేలు లాంటి వారితోపాటు కొత్తగా సత్తా చాటిన క్రీడా అణిముత్యాలెందరో ఉన్నారు. పొట్టికాలుతో పుట్టి అవహేళనను ఎదుర్కొన్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ 3 నెలల క్రితం గజ్జల్లో గాయంతో వైదొలిగే పరిస్థితి ఎదురైనా మొక్కవోని దీక్షతో పోరాడి హైజంప్‌లో స్వర్ణాన్ని సాధించాడు. టోక్యోలో రజతం సాధించిన ప్రవీణ్ ఇప్పుడు రెట్టించిన పట్టుదలతో పోరాడాడు. మరుగుజ్జుగా అవమానాలెదుర్కొన్న హర్యానాకు చెందిన నవదీప్‌సింగ్ జావెలిన్ త్రోలో స్వర్ణం సాధించాడు. కాళ్లలో సమస్యతో సరిగ్గా నిలబడలేని హర్యానాకు చెందిన హర్విందర్ ఎకనామిక్స్‌లో పిహెచ్‌డి చేస్తూనే ఆర్చరీలో స్వర్ణం సాధించాడు. రైలు ప్రమాదంలో కాలుకోల్పోయిన నితేష్‌కుమార్ కృత్రిమ పాదంతో బ్యాడ్మింటన్ ఆడి, నాలుగు పదుల వయసులో పసిడి కల నెరవేర్చుకున్నాడు. ఉగ్రవాదులు పేల్చిన మందుపాతరకు పాదం కోల్పోయిన నాగాలాండ్‌కు చెందిన ఆర్మీ మాజీ హవాల్దార్ హొకాటో హొటోజీ సెమా షాట్‌పుట్‌లో కాంస్యం సాధించాడు. సుమిత్ అంటిల్ జావిలిన్ త్రోలో వరుసగా రెండోసారి స్వర్ణాన్ని అందుకున్నాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన టాక్సీ డ్రైవర్ తనయుడు కపిల్ పర్మార్ అంధుల జూడోలో కాంస్యంతో సత్తా చాటాడు. సమ్మర్ ఒలింపిక్స్ కుస్తీపోటీల ఫైనల్లో వినేష్ ఫొగాట్‌పై అనర్హత వేటు వేయడం వెనక ఉన్న కుత్సిత రాజకీయాలకు పారాలింపిక్స్ దూరంగా ఉండటం కొంత ఊరటనిచ్చింది. వికలాంగుల సంక్షేమం కోసం చేస్తున్న చట్టాలు క్షేత్రస్థాయిలో చట్టుబండలవుతున్నా స్వయంకృషితో వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తుండడం ముదావహం. వికలాంగులకు తగినంత ప్రోత్సాహమిస్తే మరిన్ని అద్భుతాలు సాధిస్తారు. 2028 లాస్ ఏంజిల్స్ పారాలింపిక్స్‌కు ఇప్పటి నుంచే సమగ్ర ప్రణాళికతో క్రీడాకారులను సిద్ధం చేయాల్సిన అవసరమెంతైనా ఉంది.

## 'విపత్తు నిర్వహణ బిల్లు' లక్ష్యం నెరవేరుతుందా




ప్రకృతి వైపరీత్యాలు దేశమంతటా విలయతాండవం చేస్తున్న వేళ రాజకీయాల్లోకి పోకుండా ఏ విధంగా నివారణకు ఉపక్రమించాలన్నది పెద్ద సమస్యగా మారింది! రెండు తెలుగు రాష్ట్రాలలో వరదలూ, వర్షాలూ, కట్టలు తెంచుకొని ప్రవహించే నదీ జలాలూ, ఆనకట్టలు కట్టు తెగి జలమయం చేస్తూ ప్రజలను కకావికలం చేస్తూ పరుగెత్తిస్తున్న వేళ ఏ విధంగా సహాయ చర్యలు అందించాలన్నది పెద్ద సమస్యగా మారింది! ప్రభుత్వాలు ఈ సందర్భాలలో చర్యలు తీవ్రతరం చేయక తప్పదు. అయితే ఆ చర్యలు తీసుకోవటానికి ప్రకృతి సహకరిస్తుందా, వనరులు బాధితులు అందరికీ అందేవిధంగా సమగ్ర ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయా? రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల బాధ్యతలూ - నివారణ చర్యలూ ఏ విధంగా ఉండాలి? ఆర్థిక వనరులను ఏ విధంగా ఎవరు సర్దుబాటు చేయాలన్నది విపత్తులు సంభవించినప్పుడే జ్ఞాపకం వస్తున్నాయి. అసలు సమస్య బదులు కొసరు సమస్యను తీసుకొని రాజకీయ నాయకులు వైపరీత్యాలను ఆసరా చేసుకుంటూ 'బ్లేమ్ గేమ్'ను పండించే విధంగా ప్రయత్నించటం ఎంతవరకు సబబు ఆగస్టు 1, 2024న కేంద్ర ప్రభుత్వం డిజాస్టర్ మానేజ్‌మెంట్ (ఎమెండ్‌మెంటు) బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అంతకుమునుపు వున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్-2005ను మరింతగా కేంద్రీకరించే విధంగా (ఒరిజనల్ బిల్లు పూర్తి కేంద్రీకరణ పైనే దృష్టి పెట్టింది) ఈ కొత్త బిల్లు తయారు చేయబడిందా అన్నట్లు సాక్ష్యాధారాలు కనబడే రీతిలో బిల్లులోని విషయాలు ఉన్నాయి! యాక్ట్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర, జిల్లాల స్థాయిలో అథారిటీ సంస్థలూ, కమిటీలు ఏర్పరచబడే వున్నాయి. కొత్త బిల్లు మరికొన్ని సంస్థలను అంటే నేషనల్ క్రైసిస్ మానేజ్‌మెంట్ కమిటీతో పాటు హైలెవల్ కమిటీని ఏర్పరిచేందుకు మాండేట్ సమకూర్చటం, విపత్తులలో అన్ని స్థాయిలలో తీసుకొనే చర్యలను మరింత కష్టతరంగా కాలయాపన చేసేందుకు దారితీసే విధంగా ఉంది! దీనివల్ల పైనుంచి చర్యలు ఉపక్రమించటానికి కాలయాపన వల్ల బాధితులకు ఉపశమనం మరింత దూరంగా అయ్యే ప్రమాదం ఉంది! యాక్ట్ ముఖ్యోద్దేశం సహాయ సహకారాలు త్వరితంగా అందించటానికి అని అనుకుంటే- అది నెరవేరే సౌకర్యం ఈ బిల్లు వల్ల లభించదు! ఈ బిల్లు ముఖ్యోద్దేశం నేషనల్ డిజాస్టర్ మానేజ్‌మెంట్ అథారిటీని రాష్ట్ర అథారిటీతో బలోపేతం చేయటానికి, రాష్ట్ర, కేంద్ర స్థాయి ప్రణాళికల తయారీ కోసం అని చెప్తున్నా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీలు-స్టేట్ రాజధానులూ, మున్సిపల్ కార్పొరేషన్లు కూడా ఈ బిల్లు ద్వారా ఏర్పడతాయని స్పష్టపరుస్తున్నా, ఆర్థిక వనరులను - వికేంద్రీకరణ చేయనంత కాలం అనుకున్న ఫలితాలు రాకపోగా, మరిన్ని సమస్యలు ఉత్పన్నం కావటం ఖాయం! ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోటానికి కావల్సింది డబ్బూ, పనిచేసే అధికారులూ, వాలంటీర్లు, ఎన్జీవోలతో పాటు, మానవత్వం కలిగిన అనేక ఆర్గనైజేషన్ల సముదాయాలు. ప్రకృతి ప్రసాదించిన వనరులను సమయానుకూలంగా సద్వినియోగం చేసుకోటానికి ప్రభుత్వాలు పైసా పైసా లెక్కకట్టి సహాయాలు వర్షాలూ, వరదలూ పోయిన నెలనాళ్ళకు మేమున్నాం- మా సహాయం ఇది అని చెప్పటానికి యంత్రాంగాలూ, యాక్ట్‌లూ, డిజాస్టర్ మానేజ్‌మెంట్ ప్రణాళికలూ అవసరం లేదు! ఈ డిజాస్టర్ ఎమెండ్‌మెంట్ బిల్లు కూడా పాత సమస్యలనే పునరావృతం చేస్తుందా అన్న సందేహం ఉంది. ఇప్పుడున్న పరిస్థితులలో సత్వర సహాయం విపత్తు బాధితులకు అందించటమే లక్ష్యంగా ఉన్నప్పుడు కేంద్రం ఫండ్స్‌ను తమ ద్వారానే అందించాలనే దృక్పథంతో ఈ బిల్లులోని ప్రొవిజన్సు ప్రతిపాదిస్తే... అది మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉండదు. రాష్ట్రాలు ఇలాంటి సందర్భాలలో కేంద్రం వైపు చూస్తూ- ఫండ్స్ కోసం పడిగాపులు కాయటం పరిష్కారం కానేకాదు! పాత బిల్లు, డిజాస్టర్స్‌ను ఎదుర్కోవటంలో లోటుపాట్లను పూరించలేకపోవటం వల్లనే ఈ కొత్త బిల్లు తలపెట్టారన్న విచక్షణను దూరం చేసుకోకూడదు! కానీ ఈ బిల్లు ఆ అవసరాన్ని తీరుస్తుందా? కేంద్రం ఇచ్చే ఆర్థిక వనరుల విషయంలో స్పష్టమైన అవగాహన, సత్వర పరిష్కార మార్గాలు - డిజాస్టర్స్ మేనేజ్‌మెంట్ ఎమెండ్‌మెంట్ యాక్ట్ ప్రతిబింబించాలి! అధికారాలు ముఖ్యంగా ఫండ్స్ విషయంలో క్రిందిస్థాయి అధికారులు వినియోగించే విధంగా ఉంటేనే ఫలితాలు ఈ యాక్ట్ విజయానికి తోడ్పడతాయి! కలెక్టర్ స్థాయి అధికారులకు ఎన్నో విషయాల్లో విచక్షణాధికారాలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నప్పుడు, కేంద్రం ఇచ్చే విపత్తుకు సంబంధించిన ఆర్థిక వనరులను మొదటే ఎందుకు అందజేయకూడదు. ఇది ఆలోచించాల్సిన విషయం! స్థూలంగా విశ్లేషిస్తే విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లుకు రాజ్యాంగపరంగా సాధికారత సంక్రమించిందా లేదా అన్నది కూడా నిర్ణయించాల్సిన అంశం. 'విపత్తు నిర్వహణ' (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అన్న పదం కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి జాబితాల్లో ఎక్కడా లేదు. రాష్ట్ర జాబితాలలోని అంశాలు సైతం- ఉదాహరణకు చీడపీడల వంటివి- విపత్తుల జాబితాలో ఉన్నాయి. సామాజిక భద్రత, సామాజిక బీమా, ఉపాధి-నిరుద్యోగం అనే విషయాలకు సంబంధించిన ఎంట్రీ ఆధారంగా ఈ సవరణ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. ఒక విధంగా ఇది రాష్ట్రాల శాసనాధికారాల్లోకి చొచ్చుకొని రావటమే! సామాజిక భద్రత కింద అన్ని విపత్తు అంశాలను చేర్చే అవకాశం లేదు కాబట్టి ఈ బిల్లు అసంపూర్ణమని న్యాయకోవిదులూ, విపక్షాలూ వాదిస్తున్నాయి! ముందు చెప్పినట్లు అధికారుల విధినిర్వహణలో స్పష్టత లేని విధానంతో గందరగోళం వల్ల విపత్తు సహాయక చర్యలకు ఆటంకం కలిగించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి! విపత్తు నిర్వహణకు సంబంధించి కేంద్రానికి విస్తృత అధికారాలు ధారాదత్తం చేయటం స్పష్టంగా ఈ బిల్లు ప్రతిబింబిస్తున్నది! రాష్ట్రాలవారీగా... ఉదాహరణకు తెలుగు రాష్ట్రాలలో సంభవిస్తున్న సైక్లోన్లు, సునామీలూ, వరదలూ, వర్షాల పరిస్థితులకు అనుగుణంగా విపత్తు నిర్వహణ విధానాలూ, కార్యక్రమాల రూపకల్పన- ఈ రాష్ట్రాలకే ఇచ్చినట్లయితే ఎప్పటికప్పుడు నిర్వహణ సక్రమంగా వుండేది! అది లోపించిందన్నది ఈ బిల్లులో స్పష్టంగా కనపడుతున్నది! రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లోని మూడు జాబితాలలో ఏ ఒక్క జాబితాలో కూడా విపత్తు నిర్వహణ అంశం పేర్కొనకపోవటం వల్ల కేంద్రం అవశిష్ట అధికారం కింద తామే ఈ విషయంలో కూడా చట్టాలు చేయొచ్చని భావిస్తున్నది. అందువల్ల రాజ్యాంగబద్ధమే అని కూడా కేంద్ర ప్రభుత్వం అనుకోవటంలో తప్పులేదు కానీ, క్షేత్రస్థాయి అనుభవాల దృష్ట్యా ఆర్థిక వనరులతో సహా అన్ని అధికారాలు రాష్ట్రాలకు ఇస్తే, మరింతగా విపత్తుల నిర్వహణ కార్యక్రమాలు సాఫీగా జరిగే అవకాశాలు వున్నాయి! ఏది ఏమైనా 2005 ఒరిజినల్ యాక్ట్‌కు తలపెట్టిన ఎమెండ్‌మెంట్ 2024 బిల్లును మరింత లోతుగా అధ్యయనం చేసి, క్షేత్రస్థాయిలో ఎక్కువ అధికారాలు బిల్లులో కల్పిస్తేనే... ఈ విపత్తు నిర్వహణ ఎమెండ్‌మెంట్ బిల్లు లక్ష్యం నెరవేరుతుంది!

## సిక్కులు, రిజర్వేషన్లపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సిగ్గుచేటు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో భాగంగా వర్జీనియాలో చేసిన ప్రసంగంలో సిక్కు మతస్థులు, రిజర్వేషన్లపై చేసిన వ్యాఖ్యలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తప్పుపట్టారు. రాహుల్ వ్యాఖ్యలు నిరాధారమని, తప్పుదారి పట్టించేలా ఉన్నాయని, సిగ్గుచేటని అన్నారు. మొహబ్బత్ కీ దుకాణ్ నడుపుతున్నామని చెబుతున్న రాహుల్ ఇందుకు భిన్నంగా అబద్ధాల దుకాణం తెరిచారని వ్యంగ్యోక్తులు గుప్పించారు. "లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల్లో ప్రజలను తప్పుదారి పట్టించేలా అవాస్తవాలు చెబుతుండటం సిగ్గుచేటు. ఇది దేశ ప్రతిష్టను దెబ్బతీయడమే. భారతదేశంలోని సిక్కులను గురుద్వారాలలో తలపాగాలు ధరించేందుకు అనుమతించడం లేదని ఆయన చెబుతున్నారు. మత విధానాలను ఆచరించకుండా అడ్డుకుంటున్నారని అంటున్నారు. ఇది పూర్తిగా నిరాధారం, ఇందులో నిజం ఎంతమాత్రం లేదు" అని రాజ్‌నాథ్ ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. భారతదేశ సంస్కృతి పరిరక్షణలో సిక్కుల పాత్రను యావద్దేశం గుర్తించి, గౌరవిస్తుంటే వారి గురించి తప్పుడు ప్రకటనలు చేయడం విపక్ష నేతగా రాహుల్‌కు తగదని రాజ్‌నాథ్ హితవు పలికారు.

### రిజర్వేషన్లపై..

ఎన్డీయే ప్రభుత్వం రిజర్వేషన్లను రద్దు చేయాలని అనుకుంటోందని రాహుల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం మన ప్రధాని రిజర్వేషన్ సిస్టమ్‌ను పటిష్టం చేశారని చెప్పారు. ఇండియా–చైనా సరిహద్దు వివాదంపై వాస్తవాలను వక్రీకరించేలా అమెరికా గడ్డపై రాహుల్ నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. తద్వారా ప్రేమ దుకాణం నడుపుతామని చెప్పి అబద్ధాల దుకాణాన్ని రాహుల్ ప్రారంభించినట్టు కనిపిస్తోందని ఆక్షేపించారు. ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయకుండా రాహుల్ సంయమనం పాటించాలని సూచించారు.

## స్కూటర్ రిపేర్‌లో జాప్యం.. ఓలా షోరూమ్‌ను తగలబెట్టిన యువకుడు




బెంగళూరు:తన టూవీలర్ రిపేర్ చేయలేదని ఓ యువకుడు ఏకంగా ఓలా షోరూమ్‌నే తగలబెట్టాడు. ఈ ప్రమాదంలో పలు వాహనాలు, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. లక్షల్లో నష్టం వాటిల్లింది. కర్ణాటక కలబుర్గిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మహమ్మద్ నదీమ్ అనే వ్యక్తి ఆగష్టు 28న ఓలా షోరూమ్‌లో రూ. 1.4 లక్షలు ఖర్చు చేసి ఎలక్ట్రిక్ స్కూటర్ కొనుగోలు చేశాడు. అయితే కొన్న రెండు రోజుల్లోనే స్కూటర్ బ్యాటరీ, సౌండ? సిస్టమ్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. బండి ఊకే ఆగిపోవడం జరిగింది. ఈ విషయంపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, ఓలా షోరూమ్‌కు వెళ్లినా అధికారులు సరిగా పట్టించుకోలేదు. తన టూవిలర్‌ను సరైన సమాయానికి రిపేర్ చేయలేదు. దీంతో కస్టమర్ సపోర్టు ఎగ్జిక్యూటివ్‌తో వాగ్వాదానికి దిగాడు. సిబ్బంది నిర్లక్ష్యంతో విసుగు చెందిన నదీమ్.. పెట్రోల్ పోసి కంపెనీ షోరూమ్‌కు నిప్పంటించాడు. షోరూమ్ మొత్తం మంటలు వ్యాపించడంతో ఆరు స్కూటర్లు, కంప్యూటర్‌లు ధ్వంసమయ్యాయి. అయితే అదృష్టవశాత్తు ఆ సమయంలో షోరూమ్ మూసివేయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. షాప్‌కు రూ. 8.5 లక్షల నష్టం వాటిలినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడు నదీమ్‌ను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రిజర్వేషన్లపై రాహుల్ వ్యాఖ్యలు.. అమిత్ షా కౌంటర్



అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య పొలిటికల్ వార్ నడుస్తోది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా వేదికగా కేంద్రంలోని ప్రధాని మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పిస్తుంటే.. అదే స్థాయిలో కేంద్రమంత్రులు, బీజేపీ నేతలు.. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలను తప్పికొడుతున్నారు. తాజాగా రాహుల్‌పై కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా మండిపడ్డారు. దేశాన్ని విభజించేందుకు కుట్ర పన్నుతున్న శక్తులకు అండగా నిలబడటం రాహుల్‌కు, కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని అమిత్ షా విమర్శించారు. 'దేశాన్ని విభజించేందుకు కుట్ర పన్నుతున్న శక్తులకు అండగా నిలవడం, దేశవ్యతిరేక ప్రకటనలు చేయడం రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి అలవాటైపోయింది. అది జమ్మూ కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన దేశ వ్యతిరేక, రిజర్వేషన్ వ్యతిరేక ఎజెండాకు మద్దతివ్వడమైనా సరే లేదా విదేశీ గడ్డపై భారత వ్యతిరేక ప్రకటనలు చేయడమైనా సరే.. రాహుల్ గాంధీ ఎప్పుడూ దేశ భద్రతను ముప్పులో పడేస్తున్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. ప్రాంతీయవాదం, మతం, భాషా భేదాల తరహాలో చీలికలు తెచ్చే కాంగ్రెస్ రాజకీయాలను రాహుల్ గాంధీ ప్రకటన బయటపెట్టింది. దేశంలో రిజర్వేషన్ల రద్దు గురించి మాట్లాడటం ద్వారా.. కాంగ్రెస్‌కు, ఆయనకు రిజర్వేషన్‌పై ఉన్న వ్యతిరేకతను మరోసారి తెరపైకి తీసుకొచ్చారు. ఆయన మనసులో మెదిలే ఆలోచనలే చివరికి మాటల రూపంలో బయటపడ్డాయి. ఇక్కడ నేను రాహుల్‌కు ఒక విషయం స్పష్టంచేయాలని అనుకుంటున్నాను. బీజేపీ ఉన్నంతకాలం రిజర్వేషన్లను ఎవరూ రద్దు చేయలేరు. అలాగే దేశభద్రతతో ఎరూ ఆటలాడలేరు' అంటూ మండిపడ్డారు.

## కబ్జాదారులూ..ఖాళీ చేసి వెళ్లిపోండి



హైదరాబాద్: దుర్మార్గులు చెరువులను ఆక్రమించడం వల్లే వరదలు వస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చెరువులు, నాలాలు కబ్జా చేసిన వాళ్లు స్వచ్ఛంధంగా ఖాళీ చేసి వెళ్లిపోవాలని, లేదంటే తమ హైడ్రా వాటిని మొత్తం నేలమట్టం చేస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఆక్రమణదారులు ఎంత పెద్దవాళ్లైనా వదిలేది లేదని హెచ్చరించారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం(సెప్టెంబర్11) జరిగిన ఎస్సైల పాసింగ్‌అవుట్ పరేడ్‌లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 'చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మించిన అక్రమ కట్టడాలను రెగ్యులరైజ్ చేసే స్కీమ్ ఏమీ లేదు. ఫాంహౌసుల్లోని డ్రైనేజీ నీటిని ఉస్మాన్‌సాగర్,హిమాయత్‌సాగర్‌లలో కలుపుతున్నారు'అని చెప్పారు. 'పోలీసు జాబ్ అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదు. అది ఒక భావోద్వేగం. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీసులదే కీలక బాధ్యత. మా ప్రభుత్వం 30 వేలకుపైగా ఉద్యోగాలు ఇచ్చింది. మరో 35వేలకుపైగా ఉద్యోగాలు ఈ ఏడాది చివరికల్లా ఇస్తాం. టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న పరీక్షలపై ఎవరికీ అనుమానాలు లేవు. కేవలం 8 నెలల్లోనే రైతు రుణమాఫీ చేశాం. దుర్మార్గులు చెరువులను ఆక్రమించడం వల్లే వరదలు వస్తున్నాయి. డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం. కొందరు వ్యసనాలకు అలవాటు పడి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు'అని సీఎం అన్నారు.

# విద్యార్థులకు భరోసా అవసరం!



తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో అనేక డిమాండ్లతో పాటు, తెలంగాణలో విద్యాభివృద్ధికి తోడ్పడే ముఖ్య అంశం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా విద్యార్థులు ఇందులో ప్రత్యేక పాత్ర పోషించారు. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్ళ పూర్తయిన తర్వాత కూడా తెలంగాణలో విద్యా నాణ్యతకు పెద్దగా చర్యలు తీసుకుంటున్న సందర్భాలు ఎక్కడా కనిపించడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చివరిసారిగా ప్రవేశపెట్టిన బడ్జెట్ (2023–24 ఆర్థిక సంవత్సరానికి) తో పోలిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం జూలై నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో, విద్యాశాఖకు కేటాయించిన బడ్జెట్ 6.57 శాతం కంటే సుమారుగా నాలుగు శాతం ఎక్కువ. ఇది ఇప్పటికైతే చాలా మంచి విషయమైనప్పటికీ, చేయాల్సిన పనులు ఇంకా చాలానే ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం, ప్రతి విద్యార్థికి ఐదు లక్షల విద్యా భరోసా కార్డు అందజేస్తామని చెప్పారు. అయితే ఒక్క విద్యార్థికి ఇన్ని డబ్బులు ఇవ్వడం ఆచరణాత్మకంగా సాధ్యమేనా అనే సమస్య ఎదురవుతుంది. ఉదాహరణకి, తెలంగాణలో గత ఐదు సంవత్సరాలలో కేంద్ర మంత్రిత్వ శాఖ నిర్వహించే ఆల్ ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకారం, తెలంగాణలో గత ఐదు సంవత్సరాలలో సగటు 1,123,560 విద్యార్థులు బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు చదువుతున్నారు. ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి రూ 5 లక్షలను విద్యా భరోసా కింద ప్రభుత్వం ఇస్తే, మొత్తం రూ. 56,178 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది ఆచరణకు సాధ్యం కాని విషయం, ఎందుకంటే తెలంగాణ ప్రభుత్వం మొత్తం విద్య రంగానికి బడ్జెట్ కేటాయిస్తున్నది రూ. 21,292 కోట్లు మాత్రమే. అంతేకాదు, ఈ బడ్జెట్‌లోనే కనీసం పోస్ట్ గ్రాడ్యుయేట్ చేస్తున్న విద్యార్థులకు కూడా ఇవ్వలేని పరిస్థితి కనిపిస్తుంది.

### ఆలోచన మంచిదైనప్పటికీ..

పైన చెప్పిన విధంగా రెండు నివేదికల ప్రకారం, తెలంగాణలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్న విద్యార్థుల సంఖ్య ఐదు సంవత్సరాల సగటు 1,90,969 విద్యార్థులు. వీరికి ఐదు లక్షలు ఇస్తే రూ. 9,548.45 కోట్ల ఖర్చు ప్రభుత్వానికి వస్తుంది. ఉదాహరణకి, మనం ప్రభుత్వం విద్యా రంగానికి కేటాయించిన బడ్జెట్‌లో ఈ నిధులను వాడుకుందాం అని అనుకుంటే, సుమారు 45% కేటాయించిన బడ్జెట్, పీజీ విద్యార్థులకు ఐదు లక్షలు విద్యా భరోసా కార్డు స్కీమ్‌కు ఇవ్వడానికే సరిపోతుంది. ఇంతేకాకుండా, పీహెచ్‌డీ విద్యార్థులు, ఈ నివేదిక ప్రకారం సగటున ఐదేళ్లలో (2016–17 నుంచి 2021–22 విడుదల చేసిన నివేదిక) ప్రకారం ఏడాదికి 4,839 విద్యార్థులు విశ్వవిద్యాలయాలలో పేర్లు నమోదు చేసుకున్నారు. కావున వీరికి ఐదు లక్షల చొప్పున ఇస్తే కనీసం 250 కోట్లు ఖర్చవుతుంది. ఇలా విద్యా భరోసా పథకం కింద కేవలం పీజీ, పీహెచ్‌డీ స్టూడెంట్స్‌కి ఐదు లక్షల చెప్పిన ప్రతి ఏడాది ఇస్తే కనీసం ప్రభుత్వానికి 10వేల కోట్లు కావాల్సిన అవసరం ఉంది. అయితే ఈ ఆలోచన మంచిదైనప్పటికీ, ప్రస్తుత బడ్జెట్లను చూసినప్పుడు, ఇవి ప్రభుత్వాలు వాస్తవానికి అమలు చేసే ఆలోచనలో ఉండవని కనబడుతుంది.

### ఇటువంటి పథకాలు ప్రవేశపెడితే..

ఇది కాకుండా, ప్రభుత్వం కనీసం పీజీ విద్యార్థులకు పీహెచ్‌డీ విద్యార్థులకు (పీజీ విద్యార్థులు కనీసం రూ. 5,000 చొప్పున ఇచ్చినా, పీహెచ్‌డీ స్టూడెంట్స్‌కి రూ. 25,000 చొప్పున ఇస్తే), ప్రతి నెల ప్రభుత్వానికి సుమారు రూ. 110 కోట్లు వెచ్చించవలసిన అవసరం ఉంటుంది. ఇది ఏడాదికి కనీసం రూ. 1,300 కోట్లను ఈ విద్యార్థులకు చెల్లించవలసి ఉంటుంది. ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం చూస్తే, ఇది పెద్ద ఖర్చు కాదు. కాబట్టి, ఐదు లక్షల ఆశల కంటే వాస్తవ దృష్టితో, కనీసం నెలకు రూ 5,000 చొప్పున ఉపకార వేతనంగా పీజీ చేసే విద్యార్థులకు ఇవ్వడమే బాగుంటుంది. దానితోపాటు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ. 25,000 రూపాయలు ఫెలోషిప్ సదుపాయాన్ని కల్పిస్తే బాగుంటుంది. ఇవే కాకుండా, పీజీ, పీహెచ్‌డీ స్టూడెంట్స్‌కి కాన్ఫరెన్స్‌లు, ఇతర ఫీల్డ్ విజిట్లకు అవసరమైన ఏడాదికి కొంత మటుకు అన్యువల్ కంటిన్యూజెన్సీ అలవెన్స్ సుమారు రూ. 10,000 నుంచి రూ 25,000 ఇవ్వడానికి ప్రభుత్వం చొరవ తీసుకుంటే మంచిది. ఇప్పటికైనా పార్టీల అతీతంగా ప్రభుత్వాలు ఇటువంటి పథకాలను ప్రవేశ పెట్టకపోతే, ఇదివరకే కుదేలైన ఉన్నత విద్యారంగం, ఇంకా కిందికి దిగజారి, తెలంగాణలో వచ్చే తరం విద్యావంతులు కరువయ్యే పరిస్థితి కూడా మరికొన్ని సంవత్సరాల్లో మనం చూడగలం. దీనికి పెద్దగా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

# వైద్యుల ఉద్యమం నేర్పుతున్న పాఠాలు..




కోల్‌కతాలో వైద్యుల ఉద్యమం ఇంకా సద్దుమణిగినట్టు లేదు. ఒకవైపు, బెంగాల్ ప్రభుత్వం వైద్యుల్ని సమ్మె విరమించుకోమని అభ్యర్థిస్తోంది. మరోవైపు, వైద్యులు తమ డిమాండ్లకు ప్రభుత్వం నుండి పరిష్కారం లభించనంత వరకు సమ్మె విరమించుకొనే ప్రశ్నే లేదని బల్ల గుద్ది చెబుతున్నారు. సుప్రీంకోర్టు కూడా వారిని సేవల్లో చేరమని చెబుతోంది. ఇలా అంతా సందిగ్ధంగా ఉంది. కోల్‌కతా ఘటనలో జూనియర్ వైద్యుల కోణం లోనూ, ప్రజల కోణంలోనూ చూస్తే, తమ తోటి స్టాఫ్ అయినా ఒక వైద్యురాలు అత్యంత వేదనాభరితంగా, నిస్సహాయ స్థితిలో లైంగిక దాడికి గురై ప్రాణాలను కోల్పోయింది. ఇది వైద్యులూ, ప్రజలూ జీర్ణం చేసుకోలేకపోతున్నారు. పోలీసుల నుండి, ప్రభుత్వం నుండి మానవత్వంతో కూడిన స్పందన రావాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా కొన్ని ప్రయత్నాలు జరగడం జూనియర్ వైద్యులకూ, తీవ్రమైన దిగ్భ్రాంతిని కలిగించాయి. సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాల్సింది. కానీ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయకుండా మరో మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా బదిలీ చేసింది. దాంతో పాటు, బాధితురాలు ఆత్మహత్య చేసుకుందని ఆత్మహత్య కథనాలు అల్లి శవ దహనం కూడా వీలైనంత వేగం చేయించేసి డబ్బు ఆశ కూడా చూపించే ప్రయత్నాలు జరిపించడం పట్ల జూనియర్ వైద్యులకు విపరీతమైన కోపం ఉంది. అత్యాచారాలకు వ్యతిరేకంగా బలమైన చట్టం చేసినంత మాత్రాన ఇవి పరిష్కారం కావు. మహిళలను గౌరవించే సామాజిక, సాంస్కృతిక విప్లవం నిరంతరం జరగాలి.

### పేద రోగులకు చికిత్సను మరవొద్దు!

ప్రభుత్వం కోణంలో చూస్తే, వైద్యులు హాస్పిటల్‌కి చాలా అవసరం. పేదలే ప్రభుత్వాసుపత్రులకు వస్తారు. డబ్బున్న వారూ, మధ్యతరగతీ సాధారణంగా ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తారు. జూనియర్ వైద్యుల సమ్మె హాస్పిటల్ సేవలో సమస్యలను తెచ్చి పెట్టింది. రోగులు సరైన ట్రీట్మెంట్ లేక నిస్సహాయ స్థితిలో పడిపోవడం కూడా జరుగుతుంది. ఓపిడీలలో సరైన ట్రీట్మెంట్ దొరకడం లేదు. ఈ కారణాలన్నీ చూపిస్తూ, ప్రభుత్వం జూనియర్ వైద్యుల్నీ, మెడికల్ ట్రైనీలనూ వెంటనే తమ పనుల్లో చేరమని అభ్యర్థిస్తోంది. ఇక ప్రభుత్వం తరపున వాదన ఏమిటంటే, పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసు సీబీఐ చేతుల్లోకి వెళ్లింది. సీబీఐ తన పని తాను చేసుకుంటోంది. కోర్టుల ఆధ్వర్యంలో కేసు నడుస్తోంది. మహిళల మీద అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం శాశ్వత పరిష్కారాల కోసం అపరాజిత చట్టాన్ని కూడా వీలైనంత తక్కువ సమయంలో తీసుకొచ్చింది. మహిళల సెక్యూరిటీ కోసం పాలనా పరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంది. మహిళా పోలీసుల్ని రాత్రి వేళల్లో నియమించబోతోంది.

### ఆసుపత్రిపై 7 వేల మంది దాడి

దాదాపు 7,000 మంది మూక ఆగస్టు 14 రాత్రి హాస్పిటల్ మీద పడి జూనియర్ వైద్యులను భయభ్రాంతులకు గురి చేశారు. ఇదంతా కూడా పాలనా యంత్రాంగం ఆశీర్వాదం లేకుండా జరుగుతుందా ? అన్న ప్రశ్న జూనియర్ వైద్యులకు మాత్రమే కాదు, ప్రజలకు కూడా వస్తోంది. అందుకే, జూనియర్ వైద్యులు సంబంధిత ప్రిన్సిపల్‌ని సస్పెండ్ చేయమని కోరుతున్నారు. అలానే, పూర్తిగా వైఫల్యం చెందిన పోలీస్ కమిషనర్‌ను కూడా తొలగించమని కోరుతున్నారు. దాంతో పాటు బాధితురాలికి జరిగిన అన్యాయం పట్ల సరైన న్యాయబద్ధమైన పరిష్కారం కోరుతున్నారు. ప్రభుత్వం నుండి సంతృప్తికరమైన సమాధానం రానంతవరకు సమ్మె ఆగేది లేదని జూనియర్ వైద్యులు చెబుతున్నారు. ఈ రెండు ఇలా ఉంటే, దగ్గర్లో దుర్గా పూజా కారణంగా అతిపెద్ద మార్కెట్ మిస్ చేసుకుంటున్న వ్యాపార వర్గాలు అత్యంత ఆందోళనలో ఉన్నాయి. దుర్గా పూజ ఒక పూజ మాత్రమే కాదు. కొన్ని వేల కోట్ల రూపాయల వ్యాపారం. ఈ వర్గం కూడా అత్యంత ఆవేదనలో ఉంది. ఈ వ్యాపారం మీద ఎన్నో వేలమంది ఉపాధి కోసం ఆధారపడి ఉన్నారు. అందుకే ఈ వర్గం కూడా కోపంతో ఉంది.

### అధికారం కొనసాగడంతో..

సుదీర్ఘ కాలంలో ఏ ప్రభుత్వం ఉన్నా సరే, ఏ పార్టీ ఉన్నా సరే అనైతిక శక్తులు, అవినీతికర శక్తులు ఆ పార్టీలో ప్రవేశించడం, ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగించడం మనకు తెలిసిందే. నేడు బెంగాల్‌లో కూడా అదే కనిపిస్తుంది. ఉపాధ్యాయుల నియామకం విషయంలో విపరీతమైన అవినీతి ఇంతకుముందు చూశాం. అప్పుడైనా సరే, పాలకవర్గం జాగ్రత్త పడాల్సింది. దాంతో పాటు హాస్పిటల్లలోనూ, రోడ్లమీద పర్మనెంటు పోలీసుల నిర్వహణ తగ్గి, కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డ్స్ నియామకం పెరిగింది. సివిక్ వాలంటీర్ల నియామకం పెరిగింది. వీరి జీతాలు చాలా తక్కువ. ఒక పెద్ద మెడికల్ కాలేజ్ పర్మనెంట్ పోలీసుల నిర్వహణలో ఉండడం వేరు. చూసీ చూడని కాంట్రాక్టు గార్డుల నియామకంలో, నిర్వహణలో ఉండడం వేరు. నేడు మన పాలకవర్గాలు చాలా రాష్ట్రాల్లో ప్రజలకు ఉచితాలను అలవాటు చేసి ప్రజల్లో ప్రశ్నించే స్వభావం, నిరసించే గుణం తగ్గించేశారు. ఇలాంటి ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలు ప్రపంచ బ్యాంకు సలహాలతో ముందుకు నడుస్తాయి. కాబట్టి, మనం వుయ్ వాంట్ జస్టిస్ అన్నప్పుడు ఒకవైపు బాధితురాలికి సరైన న్యాయం అందాలి. మరోవైపు, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రతి హాస్పిటల్‌లోనూ సెక్యూరిటీలో కాంట్రాక్టు ఉద్యోగులను పూర్తిగా తగ్గించి పర్మనెంట్ పోలీసుల చేతుల్లోకి వెళ్లాలి. అందుకోసం, పోలీసుల నియామకాలు యుద్ధ ప్రాతిపదికన జరగాలి.

### హీరోల ప్రవర్తన జుగుప్సాకరం!

మహిళల మీద అత్యాచారాలకు వ్యతిరేకంగా బలమైన చట్టం చేసినంత మాత్రాన ఇవి పరిష్కారం కావు. ప్రజా వ్యతిరేక విధానాలను తొలగించి, ప్రజానుకూల విధానాలు రావాలి. అలానే, ప్రజల్లో సామాజిక, సాంస్కృతిక చైతన్యం పెరగాలి. మహిళల పట్ల చులకన భావం, మహిళలని అవమానించే భాష వాడకం తగ్గాలి. అవతలి మహిళను గౌరవించే పెరగాలి. అందుకు నిరంతరంగా సాంచే సంస్కృతిక రంగంలో మార్పు జరగాలి. అలానే, మన సినిమాల్లో హీరోల ప్రవర్తన హీరోయిన్ పట్ల అత్యంత చులకన భావంతో ఉంటుంది. వాడే భాష కూడా అలాగే ఉంటుంది. దాన్నే బాగా ప్యాక్ చేసి ఒప్పించే తప్పుడు విలువలు అత్యంత ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇలాంటి సినిమాలు చూడకుండా నిరసన తెలియజేయడం కూడా రావాలి. ఇలా సామాజిక, సాంస్కృతిక విప్లవం నిరంతరం జరగాలి. అప్పుడే వుయ్ వాంట్ జస్టిస్ ఉద్యమానికి న్యాయం జరుగుతుంది.

# సంక్షేమంపై ప్రయి'వేటు'!



అద్దాల మేడల నిర్మాణంలో రాళ్లెత్తే కూలీలు వారు. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు జీవులు. అడ్డాలపై నిలబడి పనికోసం పడిగాపులు పడుతుంటారు. ఎన్నో పోరాటాల ఫలితంగా కొన్ని హక్కులు, సంక్షేమ పథకాలు సాధించుకున్నారు. ఇప్పుడు ఆ పథకాల నుండి ప్రభుత్వం తప్పుకోజూస్తున్నది. ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగించి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నిస్తోంది. దీని కోసం టెండర్లను కూడా ఆహ్వానించింది. దీంతో భవన నిర్మాణ కార్మికులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2009లో వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులోని ప్రమాద మరణం, సహజ మరణం, పాక్షిక, శాశ్వత అంగవైకల్యానికి సంబంధించిన పథకాలను ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామంటూ ఆగస్టు 21వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న ఈ పథకాలను ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగించడం వల్ల వచ్చే ఆ కాస్త ప్రయోజనాలు కూడా అందకుండా పోతాయేమోనని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. వీరి వేదనలో నిజం లేకపోలేదు. ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే అనేక తప్పులు చూపి, సాకులు వెదికి కార్మికులకు రావల్సిన నష్టపరిహారం అందకుండా చేస్తున్నారు. ఇక (ప్రయివేటు) ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తే సమస్య ఎంత జఠిలమవుతుందో ప్రత్యేకంగా చెప్పక్కరలేదు. ఇందులో అనేక తిరకాసులు కూడా ఉన్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వెల్ఫేర్ బోర్డులో తమ పేర్లు నమోదు చేసుకున్న కార్మికులు 25,71,880. వీరంతా ప్రతి ఐదేండ్లకు ఓసారి రెన్యువల్ చేయించుకోవల్సి వుంటుంది. అనేక సమస్యలతో ప్రస్తుతం 15,10,330 మంది మాత్రమే రెన్యువల్ చేయించుకున్నారు. ప్రభుత్వం వీరిని మాత్రమే కార్మికులుగా గుర్తిస్తోంది. మిగిలిన వారిని ఈ స్కీమ్ పరిధిలో చూపించడం లేదు. మరో విషయం గిగ్ వర్కర్స్(ఆన్లైన్ కార్మికులు)ను కూడా ఇందులో కలుపుతామంటున్నారు. అయితే వీళ్లకు ప్రీమియం ఎవరు కడతారనే దాంట్లో స్పష్టత లేదు. నిబంధనల ప్రకారం పది లక్షల రూపాయలకు మించి కట్టే ప్రతి భవనానికి ఆ యజమాని పర్మిషన్ల సమ యంలో ప్రభుత్వానికి ఒక శాతం చెల్లించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలా రూ. 5,700 కోట్లు బోర్డులో జమయ్యాయి. ఇందులో రూ. 4,262 కోట్లు మాత్రమే కార్మికుల సంక్షేమానికి అందాయి. మిగిలిన మొత్తం గత ప్రభుత్వ హయాంలో ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లు ఖర్చు చేసుకున్నారు. చట్టం ప్రకారం ఒక శాఖకు చెందిన నిధులను మరో శాఖకు మళ్లించే హక్కు ప్రభుత్వానికే లేదు. అయినా న్యాయంగా కార్మికులకు అందాల్సిన నిధులను అధికారులు దారి మళ్లించారు. వాస్తవానికి 1996 చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డుకు కార్మిక సంఘ నాయకులతో ఓ అడ్వయిజరీ కమిటీ నియమించాలి. నిధులు ఖర్చు పెట్టాలన్నా, మార్పులేమైనా చేయాలన్నా ఈ కమిటీ నిర్ణయించాలి. అలాంటి కమిటీ మన రాష్ట్రంలో అసలు లేకపోవడమే ఈ సమస్యలకు ప్రధాన కారణం. మరో ముఖ్యమైన విషయం ఈ పదేండ్లలో రాష్ట్రంలో కేవలం 5639 మంది మరణం ద్వారా, 627 మంది అంగవైకల్యం ద్వారా ఈ పథకాల నుండి ప్రయోజనం పొందారు. కానీ ప్రీమియం మాత్రం ప్రభుత్వం ప్రతి ఏడాది అందరికీ చెల్లిస్తుంది. దాంతో పెద్ద మొత్తంలో అందులో డబ్బు జమవుతుంది. వడ్డీ కూడా బాగానే వస్తుంది. ఇదంతా ప్రస్తుతం వెల్ఫేర్ బోర్డ్ ఆధ్వర్యంలో ఉంది. అయితే ఐఆర్డీఏ పరిధిలోని ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామని అంటున్నారు. అందులో ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రయివేటు కంపెనీలు కూడా ఉన్నాయి. ఏ కంపెనీలకు అప్పగిస్తారనేదాంట్లో స్పష్టత లేదు. ఒకవేళ ప్రయివేటు వారికి అప్పగిస్తే కార్మికుల నిధిని ఇన్సురెన్స్ కంపెనీలు స్వాహా చేసే ప్రమాదముంది. ఒకపక్క అడ్డాల్లో మౌలిక సదుపాయాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేరళ, పంజాబ్, ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రాలు 60 ఏండ్లు దాటిన కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నాయి. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం ఇలాంటివేవీ అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్మిక సంక్షేమ పథకాలను సరిగ్గా అమలు చేస్తుందనుకుంటే ముఖ్యమైన స్కీంలను హడావుడిగా ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామంటున్నది. అందుకే కార్మికులు ఆందోళన చెందుతున్న పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి. కార్మిక సంఘాలతో చర్చలు జరపాలి. ఎట్టిపరిస్థితుల్లో కార్మిక సంక్షేమ పథకాలను ప్రభుత్వమే అమలు చేయాలి. ఒకవేళ అప్ప గించాల్సి వస్తే ఎల్ఐసీ వంటి ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే అప్పగించాలి. అప్పుడే కార్మికులకు మేలు జరుగుతుంది. అలాగే వెంటనే వెల్ఫేర్ బోర్డ్ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేయాలి. ఇది సర్కారు బాధ్యత.